



చదివి..ఎదిగారు.. వీసీగా వచ్చారు!

నన్నయ వీసీగా సత్తుపాటి ప్రసన్నశ్రీ

విద్యార్థులకు ఆమె ఆదర్శం.. ఎలా చదవాలి.. ఎలా ఎదగాలి అనే దానికి ఆమె ఒక నిదర్శనం.. ఎందుకంటే ఎక్కడో గుంటూరు జిల్లా స్టూవర్టుపురం ఆమె స్వగ్రామం.. ఆ పేరు వింటే అందరికీ గుర్తొచ్చేది ఒక్కటే.. కానీ అక్కడ నుంచి ఎదిగారు.. కష్టపడి చదివారు.. ఒక్కటి కాదు.. రెండు ఏకంగా 23 భాషలు మాట్లాడతారు.. 17 గిరిజన భాషలకు లిపిని తయారుచేసి తానేంటో నిరూపించారు.. కూటమి ప్రభుత్వం పట్టం కట్టడంతో తూర్పుగోదావరి జిల్లాలోని నన్నయ వర్సిటీ ఉపకులపతిగా ఆచార్య సత్తుపాటి ప్రసన్నశ్రీ గురువారం బాధ్యతలు స్వీకరించారు.. ఆమెను ఆంధ్రజ్యోతి పలకరించగా నేను రాజమహేంద్రవరం కోడలినే అంటూ పలు విషయాలు చెప్పకొచ్చారు.. 6

సిల్వర్..మెరుపులు!



బంగారమే కాదందోయ్.. సిల్వర్ ధగధగ లాడుతోంది.. తగ్గుతూ పెరుగుతూ రూ.లక్షకు చేరింది.. గత వారం రోజులుగా రూ.99,500లకు చేరువై రూ.లక్ష దోబూచులాడుతోంది.. బుధవారం రూ.99,800లు పలికింది.. గురువారం రూ.లక్షకు చేరువైంది. 6

మన ప్రకృతి సాగుపై జర్మన్ బృందం ఆసక్తి



మన ప్రకృతి సాగును పరిశీలించేందుకు జర్మన్ బృందం వచ్చింది.. దేవరపల్లి మండలం పల్లంట్ల గ్రామంలో రైతులతో మాట్లాడి ప్రకృతి సాగుపై అవగాహన పెంచుకుంది.. ఎలా సాగు చేయాలో పరిశీలించింది. 7

జిల్లాలో 12 కిలోమీటర్ల మేర ఎకో సెన్సిటివ్ జోన్

కోరంగి ఎకో సెన్సిటివ్ జోనల్ మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలి

కలెక్టర్ మహేష్‌కుమార్



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 12 కిలోమీటర్ల పొడవునా ఎకో సెన్సిటీవ్ జోన్ ఉందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. ఎకో సెన్సిటీవ్ జోన్ సరిహద్దు 50 మీటర్ల నుంచి సముద్రం లోపల 5 కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉందన్నారు. కోరంగి వైల్డ్ లైఫ్ అభయారణ్యం పరిధిలో వివిధ శాఖల ద్వారా నిర్వహిస్తున్న కార్యకలాపాల వివరాలను పొందుపరుస్తూ ఎకో సెన్సిటీవ్ జోనల్ మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం జిల్లా అటవీశాఖ అధికారి ఎంవీ ప్రసాదరావు, కాకినాడ జిల్లా అటవీశాఖ అధికారి డి.రవీంద్రనాథ్‌రెడ్డితో కలిసి కోరంగి వైల్డ్‌లైఫ్ అభయారణ్యంలో జోనల్ మాస్టర్ ప్లాన్ తయారీపై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం గుర్తించిన ప్రాంతమని ఆయన పేర్కొన్నారు. పర్యావరణంలో పాటు టూరిజం కార్యక్రమాలను ఆ ప్రాంతంలో అనుమతిస్తారన్నారు. కాట్రేనికోన మండలం బ్రహ్మసమేధ్యం, ఐ.పోలవరం మండలం గుత్తెనదీవి, రెవెన్యూ గ్రామాల పరిధిలో జోన్ ఉందన్నారు. సంబంధిత అధికారులు ఆయా ప్రాంతాల్లోని సామాజిక, ఆర్థిక పరిస్థితులు, జీవనశైలి, కార్యకలాపాలు వంటి వాటితో సైంటిఫిక్ మ్యాప్‌లను మార్చి 15 నాటికే సిద్ధం చేసి సమర్పించాలని ఆదేశించారు. ఎకో సెన్సిటీవ్ జోన్ 2021లో నోటిఫై అయిందని, దాని ప్రకారం జోన్ మాస్టర్ ప్లాన్ తయారు చేయాలన్నారు. జోన్ పరిధిలో ఉన్న టూరిజం, మత్స్యరంగం, వాటి అనుబంధ పరిశ్రమలు, డ్రైన్లు, రోడ్లు, కాల్వలు, వ్యవసాయం, ఉద్యాన పంటలు ద్వారా ప్రస్తుతం పొందుతున్న జీవనోపాధుల ఆధారంగా ముసాయిదాను తయారు చేయాల్సి ఉంటుందన్నారు. డీఎఫ్‌వో రవీంద్రనాథ్‌రెడ్డి, కోరంగి వైల్డ్‌లైఫ్ అభయారణ్యం జోనల్ మాస్టర్ ప్లాన్ తయారీ ఆవశ్యకతను సభ్యులకు వివరించారు. అభయారణ్యం బయట ఉన్న సరిహద్దు నుంచి వివిధ ప్రదేశాలను కలుపుతూ 12 కిలో మీటర్ల పొడవునా ఎకో సెన్సిటీవ్ జోన్ ఉందన్నారు. ఈ జోన్ వల్ల వన్యప్రాణుల స్వేచ్ఛకు, మనుగడకు మరింత భద్రత ఏర్పడుతుందన్నారు. పర్యావరణ సమతుల్యత నెలకొని పచ్చదనం పెంపొందడంతో పాటు సేంద్రియ వ్యవసాయానికి అవకాశం ఉంటుందన్నారు. జోన్ పరిధిలో వర్షపు నీటిని వివిధ పద్ధతుల్లో నిల్వ చేసుకుని జంతువులకు తాగునీటి సమస్య లేకుండా చేయవచ్చునన్నారు. తిరువనంతపురం సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఎకో సెన్సిటీవ్ జోనల్ మాస్టర్ ప్లాన్ తయారు చేయనున్నారని దీనిలో సంబంధిత శాఖల అధికారులందరూ భాగస్వాములు కావాలన్నారు. జోన్ పరిధిలో ఏవైనా పరిశ్రమలు కొత్తగా నెలకొల్పాలంటే పూర్తిస్థాయి అనుమతులు పొందాల్సి ఉంటుందన్నారు. తొలిసారిగా జోనల్ మాస్టర్ ప్లాన్ తయారీ, కాకినాడ, కోనసీమ జిల్లాల్లోనే జరుగుతుందని వివరించారు. సమావేశంలో హైదరాబాద్ సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ డెవలప్‌మెంట్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ కె.జయచంద్రజీ, పశుసంవర్ధక శాఖ జేడీ ఎస్.వెంకట్రావు, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, డ్రైనేజీ ఇంజనీర్ ఎంవీవీ కిశోర్, సహాయ సంచాలకుడు డాక్టర్ ఎల్.విజయారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోలవరం ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలి 7



సైకిల్‌కు సవాల్

కూటమి పక్షాన భారీగా మోహరింపు

- ఎమ్మెల్సీ ఎన్నికపై తీవ్ర ఉత్కంఠ
- మంత్రులు, ఎమ్మెల్యేల మోహరింపు
- ఆశించిన మెజార్టీ కోసం పట్టు
- బరిలో 35 మంది అభ్యర్థులు
- ఓటర్లు 3.15 లక్షలు
- చెల్లని ఓట్ల తగ్గింపుపై వ్యూహం
- పట్టభద్రుల చుట్టూ ప్రచారం

(ఏలూరు/కాకినాడ, ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి పోటీలో ఉన్న అభ్యర్థులంతా ప్రచారానికి మరింత పదునుపెట్టారు. క్షేత్ర స్థాయిలో గట్టి నాయకత్వ పట్టున్న టీడీపీ ఎట్టి పరిస్థితుల్లోను ఈ స్థానం నుంచి తమ పార్టీ బలపరిచిన అభ్యర్థి గెలిచి తీరాలనే పట్టుదలతో ఉంది. సీఎం చంద్రబాబు నుంచి ముఖ్యనేత లంతా ఎప్పటికప్పుడు నియోజకవర్గాల వారీగా సమాచారాన్ని రాబట్టడమే కాకుండా అప్పటి కప్పుడే సమీక్షిస్తున్నారు. ప్రచారంలో ఎక్కడ వెనుకబడ్డారు? ఎక్కడ దూసుకెళ్తున్నారనే విషయాన్ని రాబడుతూనే వచ్చారు.పట్టభద్రులైన ఓటర్లంతా తరలివచ్చేలా చేయడం అంత సులువు కాదని భావించి యంత్రాంగాన్ని మరింత అప్రమత్తం చేశారు. గత అనుభవాలను దృష్ట్యా సాధారణ ఎన్నికల కంటే మించి ఎమ్మెల్సీ అభ్యర్థికి అత్యధిక ఓట్లు రావా లన్న షరతు విధించారు.దీంతో ఇప్పుడు కూటమిలో ఉన్న ఎమ్మెల్యేలు,మంత్రులతో పాటు మిగతా వారందరికీ ఈ ఎన్నిక ఒక సవాల్‌గానే మారింది.పట్టభద్రుల ఓటర్లు అత్యధికంగా ఉన్న మండల కేంద్రాలు,పట్టణాలు, కార్పొరేషన్లలో ప్రచారాన్ని మోహరించారు.

బరిలో 35 మంది..

ఎన్నికల బరిలో 35 మంది అభ్యర్థులు రంగంలో ఉన్నారు. వీరిలో అత్యధికులు ప్రచారంలోను శరవేగంగా ముందుకు సాగుతూనే ఉన్నారు. యువతకు మేలు జరగాలంటే తాము విధాన పరిషత్‌లో అడుగు పెట్టేలా చూడాలని ఓటర్లను అభ్యర్థిస్తూ వస్తున్నారు. తెలుగుదేశం పక్షాన పేరాబత్తుల రాజశేఖరం అభ్యర్థిగా ఉన్నారు. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, మంత్రులు, వివిధ విభాగాల కార్పొరేషన్ల చైర్మన్‌లు, సభ్యులతోపాటు స్థానిక సంస్థల ప్రతినిధులు ప్రచారంలో ఒక ఊపు తెస్తున్నారు. ఏ నియోజకవర్గంలో ఎంతెంతమంది ఓటర్లు ఉన్నది ఇప్పటికే గుర్తించినందున దీని ఆధారంగా చేసుకుని ఎమ్మెల్యేలు ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ఇప్పటికే ఉమ్మడి పశ్చిమ గోదావరికి చెందిన ఇన్‌చార్జి మంత్రులు గొట్టిపాటి, నాదెండ్లతో పాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి ఇన్‌చార్జి మంత్రులు నారాయణ,అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడు కూటమి నేతలను ఏకం చేసి ఏ రోజుకారోజు నియోజకవర్గాల్లో ఉన్న స్థితిగతులను ఆరా తీస్తున్నారు. వీరితో పాటు మంత్రులు కందుల దుర్గేష్‌సుభాష్ కూడా ఆయా నియోజకవర్గాల్లో కూటమి శ్రేణులను సమన్వయం చేస్తున్నారు. జనసేన పక్షాన ఎమ్మెల్యేలుగా ఉన్న పోలవరం, ఉంగుటూరు, నరసాపురం, తాడేపల్లిగూడెం, నిడదవోలుతో పాటు రాజానగరం, పిఠాపురం, రాజోలు, పి.గన్నవరం, కాకినాడ రూరల్ నియోజకవర్గాల్లో ఎమ్మెల్సీ ఓటర్ల నాడి ఎలా ఉందో జనసేన ఆ పార్టీ ఆరా తీస్తోంది. బీజేపీ మాత్రం ఈ విషయంలో పెద్దగా చొరవ తీసుకున్న పరిస్థితి కనిపించడంలేదు. తెలుగుదేశం, జన సేన నేతలంతా ఉమ్మడిగా నియోజకవర్గాల్లో కలియ తిరుగుతుండగా,కమలనాథులు మాత్రం తమకు ప్రత్యేకించి ఆహ్వానం లేదన్నట్టుగా మిన్నకుండిపోతున్నారు.మండల స్థాయిలోను ఇదే ధోరణిలో అన్ని పార్టీలు ఉన్నాయి. తెలుగు దేశం మాత్రం అభ్యర్థి రాజశేఖరం గెలుపును భుజానకెత్తుకుని విరామం లేకుండా ప్రచారం కొనసాగిస్తోంది.

చెల్లని ఓట్లే అత్యంత కీలకం

గడిచిన పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో భారీగా చెల్లని ఓట్లు నమోదయ్యాయి. అప్పట్లో రెండు లక్షల 20 వేలకుపైగా ఓట్లు ఉండగా లక్షా 92 వేల 24 ఓట్లు పోలయ్యాయి. దాదాపు 13 వేల 852 ఓట్లు చెల్లకుండా పోవడంతో అందరూ ముక్కున వేలేసుకున్నారు. పీడీఎఫ్ బలపరిచిన యిళ్ల వెంకటేశ్వరరావుకు 98 వేల 193 ఓట్లు లభించగా ఆయన సమీప ప్రత్యర్థి నల్లమిల్లి శేషారెడ్డికి 38 వేల 124 ఓట్లు లభించాయి. ఇప్పుడు జరగబోతున్న ఎన్నికల్లో టీడీపీ పక్షాన రాజశేఖరం ఉండగా పీడీఎఫ్ తరపున దిడ్ల వీరరాఘవులు పోటీ పడుతున్నారు. వీరిద్దరి మధ్య నువ్వా నేనా అన్నంతగా కూటమి పక్షాన వామపక్షాల తరపున హోరాహోరీగా ప్రచారం సాగుతోంది. వచ్చిన చిక్కల్లా ఏంటంటే ఈ సారి గతంకంటే లక్ష ఓట్లు అదనంగా మూడు లక్షల 15 వేలకుపైగా ఓటర్లు ఉన్నారు. ఇప్పుడు ఎటు తిరిగి సాధ్యమైనంత మేర చెల్లని ఓట్లు తగ్గించుకోవడం, ఆ మేరకు మెజార్టీ స్థానంలో వచ్చేలా చూడడం కూటమి పక్షాన నేతలందరికీ పెద్ద అగ్ని పరీక్షగానే మారింది. అందుకనే ప్రాధాన్యత ఓటు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా ఓటర్లందరికీ విడమరిచి మరీ చెబుతున్నారు. ఎన్నికల అధికారులు ఇచ్చిన పెన్నుతోనే బ్యాలెట్ పేపర్‌పై ఒకటవ ప్రాధాన్యత ఓటును ఒకటవ సంఖ్యగా వేయాల్సిందిగా పదేపదే చెబుతూ వస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇన్ టూ మార్క్ పెట్టవద్దని అభ్యర్థిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మిగతా ఇండిపెండెంట్ సభ్యులు భారీగానే ఉన్నందున వీరంతా ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి ప్రచారం ఉధృత స్థాయికి తీసుకువెళ్తున్నారు. గత ఎన్నికల్లో 43 మంది పోటీ పడగా 12 మంది అభ్యర్థులు మాత్రమే వెయ్యి సంఖ్యను దాటి ఓట్లు దక్కించుకోగలిగారు. ఈసారి టీడీపీకి పూర్తి అనుకూలత దక్కేలా కూటమి నేతలు మోహరించడంతో ఆ మేరకు మిగతా ఇండిపెండెంట్‌లకు వచ్చే ఓట్ల సంఖ్యలో చీలిక ఏర్పడే అవకాశం కనపడుతుంది.



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు చిత్రంలో ఎమ్మెల్యేలు, నాయకులు

గెలుపు రాజశేఖరందే

మంత్రి నిమ్మల రామానాయుడు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లా పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని జిల్లా ఇన్‌చార్జి, జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఎంత మంది అభ్యర్థులు ఉన్నా తమదే గెలుపు అన్నారు. ఈ సమావేశంలో రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి,రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మ న్ కుడుపూడి సత్తిబాబు, అనుశ్రీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఆనందం వరించెన్!

అప్పుడు ఏడిపించెన్...ఇప్పుడు ఠంఛన్

- తీరిన అన్నదాతల కష్టాలు
- చకచకా ఖరీఫ్ ధాన్యం సేకరణ
- 5 లక్షల మెట్రిక్ టన్నులు
- ఖాతాల్లోకి రూ.910 కోట్లుపైనే
- ఠంఛనుగా చెల్లింపులు
- ఉమ్మడి జిల్లాలో ఆనందం
- గత వైసీపీలో రైతులకు చుక్కలు
- నెలల తరబడి వేధింపులు
- నాడు ఏప్రిల్ దాటినా అరకొరే
- బాకీలు అడిగితే అరెస్టులు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఎన్నాళ్లకెన్నాళ్లకు..అన్నదాతలకు ఆనందం వరించెన్..బకాయిలకు ఎదురు చూపుల్లేవు.. కాళ్లరిగేలా అధికారుల చుట్టూ తిరగడం లేదు.. ఖాతాలో డబ్బులు పడ్డాయో లేదో నెలలతరబడీ బ్యాంకుల వద్ద పడిగాపులు లేవు..ధాన్యం ఇచ్చిన కొన్నిరోజులకే ఏ మాత్రం ఆలస్యం లేకుండా నేరుగా ఖాతాల్లోకి డబ్బులు.. ఇదీ కూటమి ప్రభుత్వం రాకతో జిల్లాలో మారిన అన్నదాతల పరిస్థితులు..జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ ధాన్యం సేకరణ ఎట్టకేలకు పూర్తికాగా ఇప్పటి వరకు సేకరించిన సుమారు 5 లక్షల మెట్రిక్ టన్నులకు అన్నదాతల ఖాతాల్లోకి ఏకంగా రూ.910 కోట్లకుపైగా కూటమి ప్రభుత్వం చెల్లించింది. ఐదేళ్ల తర్వాత తొలిసారి ధాన్యం బకాయిలకు అన్నదాతలు రోడ్డెక్కే పరిస్థితి లేకుండా ఠంఛనుగా చెల్లింపులు జరిగాయి.గత వైసీపీ ప్రభుత్వంలో ఏటా అన్నదాతలకు నరకయాతనే.

గత ఐదేళ్లూ నరకమే..

వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్ల అన్నదాతలకు ధాన్యం డబ్బుల కష్టాలు పెరిగాయి. ధాన్యం డబ్బులు 21 రోజుల్లో చెల్లిస్తా మంటూ అప్పట్లో సీఎం జగన్ వరుసగా ఐదేళ్ల పాటు గొప్పలు చెప్పారు. కానీ ఆచరణలో ఏ యేడు దీన్ని నిలబెట్టుకోలేదు. ప్రతి ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో అన్నదాతల నుంచి ధాన్యం సేక రించడం, బాకీలు నెలలు గడుస్తున్నా ఇవ్వ కుండా వేధించడం పరిపాటి.ఎవరైనా రైతులు బాకీలకు రోడ్డెక్కితే అరెస్టులు చేయించింది. చివరకు బాకీ వివరాలు సైతం బయటకు పొక్క నీయొద్దని జిల్లా జేసీలు, పౌరసరఫరాల సంస్థను ఆదేశించి గుట్టు పాటించింది. వాస్తవానికి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 10.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు అన్నదాతలు డబ్బులు ఇవ్వకుండా ముప్పుతిప్పలు పెట్టేది. లక్ష్యం కంటే తక్కువగా సేకరించిన ధాన్యానికి రూ.1,143 కోట్ల వరకు చెల్లించాల్సి వచ్చేది. కానీ ప్రభుత్వం మాత్రం ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరించిన తర్వాత మార్చి,ఏప్రిల్ దాటినా సరే చెల్లించాల్సిన బాకీల్లో సగం కూడా అన్నదాతల ఖాతాల్లోకి జమచేసేది కాదు. అటు రబీలోను ఇదే తంతు. రూ.700 కోట్ల వరకు చెల్లింపులు చేయాల్సి ఉంటే వాటినీ ఇచ్చేది కాదు. ఐదేళ్ల పాటు అన్నదాతలను అప్పటి వైసీపీ ప్రభుత్వం దారుణంగా వేధించింది. అనేక సార్లు కోనమసీ, కాకినాడ జిల్లాల్లో అన్నదాతలు బాకీల కోసం రోడ్డెక్కారు. తూర్పుగోదావరి జిల్లా రాజమ హేంద్రవరానికి సమీపంలో ఓ మండలంలో ధాన్యం బాకీ కోసం ఓ రైతు ఏకంగా ఆత్మహత్య చేసుకున్న పరిస్థితి. ఇలా గత వైసీపీ పాలనలో అనేక మంది అన్నదాతలు నరక యాతన పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత పరిస్థితులు మారిపోయాయి. కూటమి ప్రభుత్వంలో తొలిసారీ ఖరీఫ్ ధాన్యం సేకరణ కావడంతో ప్రభుత్వం ఎక్కడికక్కడ జాగ్రత్తలు తీసుకుంది.ఏ రైతుకు ఇబ్బంది లేకుండా అధికారులను అప్రమత్తం చేసింది.

ఠంఛనుగా ఖాతాల్లోకి..

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జరిగిన తొలి ఖరీఫ్ ధాన్యం సేకరణ నేపథ్యంలో చెల్లింపులను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఎక్కడా లోటు పాట్లు లేకుండా ఠంఛనుగా చెల్లింపులు చేసింది.ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా 4.50 లక్షల మెట్రిక్ టన్నులకు రైతుల ఖాతాల్లోకి రూ.910 కోట్లుపైనే జమచేసింది. కాకినాడ జిల్లా వ్యాప్తంగా 1.55 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించింది. అత్యధికంగా సామర్లకోట మండలంలో 35,723 మెట్రిక్ టన్నులు, కరప 19,838, పెదపూడి 19,450, కాజులూరు 17,026, జగ్గంపేట 11,792, పెద్దాపురం 8,042, కోటనందూరు మండలంలో 7,780 మెట్రిక్ టన్నుల చొప్పున ధాన్యం సేక రించింది. ఎక్కడా ధాన్యం తీసుకోవడం లేదనే ఫిర్యాదు లేకుండా అన్నదాతలందరి వద్ద గింజలు సేకరించింది. జిల్లా వ్యాప్తంగా రూ.356 కోట్ల విలువైన ధాన్యాన్ని సేకరించి 102 మిల్లులకు అప్పగించింది.ఇందులో ఇప్పటి వరకు మొత్తం రూ.355.01 కోట్లు చెల్లించేసింది. మిగిలిన చిన్న మొత్తాలకు ఎఫ్‌టీవోలు తయారుచేసి చెల్లింపులకు పంపింది.ఇలా ఎక్కడా జాప్యం లేకుండా పక్కాగా సకాలంలో చెల్లింపులు జరిపింది. ఇలా 26,415 మంది అన్నదాతల ఖాతాల్లోకి డబ్బులు జమ చేసింది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 2.27 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరిం చింది. ఇందుకు రూ.523 కోట్లు చెల్లించాల్సి ఉం డగా ఇప్పటి వరకు రూ.522.71 కోట్లు చెల్లిం చింది. మొత్తం 39,180 మంది అన్నదాతల ఖాతాల్లోకి జాప్యం లేకుండా చెల్లింపులు జరి పింది.అత్యధికంగా రామచంద్రపురం మండ లంలో 28,357 మెట్రిక్ టన్నులు, పామర్రు 27,311, కపిలేశ్వరపురం 24,183, మండపేట మండలంలో 18వేలకుపైగా మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించింది. తూర్పుగోదావరి జిల్లాలో రూ.200 కోట్లకు పైగానే చెల్లింపులు చేసింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా ఏరైతును ఇబ్బంది పెట్టకుండా దాదాపు 90 వేల మందికిపైగా రైతుల ఖాతాల్లోకి డబ్బులు జమచేసింది. దీంతో రైతులు ఆనందోత్సవాలు చేసుకుంటున్నారు. గడచిన ఐదేళ్లలో ఏనాడు డబ్బులు ఇలా సకాలంలో రాని పరిస్థితులు కళ్లారా చూసిన అన్నదాతలు కూటమి ప్రభుత్వం రాకతో ఆనాటి చీకటి రోజులు తొలగి ఎప్పటి బాకీలు అప్పుడు జమ అవడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మాస్ కాపీయింగ్‌కు తావు లేకుండా పరీక్షలు నిర్వహించాలి

అమలాపురం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా అత్యంత పకడ్బందీగా పరక్షలు నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ కలెక్టర్లను ఆదేశించారు. ఈ నెల 23న నిర్వహించనున్న గ్రూప్-2, మార్చి 1 నుంచి జరిగే ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పబ్లిక్ పరీక్షలు ఫేక్ న్యూస్‌కు ఆస్కారం లేకుండా నిర్దేశిత మార్గదర్శకాలను అనుసరిస్తూ నిర్వహించాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులతో గురువారం అమరావతి నుంచి పరీక్షల నిర్వహణతో పాటు అనేక అంశాలపై కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. వీడియో కాన్ఫరెన్సు అనంతరం అధికారులను ఉద్దేశించి కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ మాట్లాడుతూ ఇంటర్, గ్రూప్-2 పరీక్షల నిర్వహణకు స్క్వాడ్‌లు, ఇన్విజిలేటర్ల బృందం సమన్వయంతో ప్రశ్నావళి, జవాబు పత్రాల భద్రతను దృష్టిలో పెట్టుకుని పూర్తి ఎస్కార్టుతో తరలించాలన్నారు. శాంతియుత వాతావరణంలో సజావుగా పరీక్షలు నిర్వహించాలన్నారు. సమస్యాత్మక పరీక్షా కేంద్రాల వద్ద భద్రతను మరింత పెంచాలన్నారు. సీసీ కెమెరాల నిఘా వ్యవస్థను పరీక్షా కేంద్రాల నుంచి జిల్లాస్థాయి కంట్రోల్ రూముకు అనుసంధానంచేస్తూ నిశితంగా పరీక్షల నిర్వహణ తీరును పర్యవేక్షించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జీరో పేదరిక నిర్మూలన కోసం స్వర్ణాంధ్ర విజన్‌లో మొదటి అంశంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్య పీ-4 వ్యవస్థను ఉగాది నుంచి అమలు చేయనున్నట్టు వెల్లడించారు. అత్యున్నత ఆర్థిక స్థానాల్లో ఉన్నవారిలో పది శాతం మంది దిగువన ఉన్న 20 శాతం మందికి సహాయం చేసి వారికి సాధికారిత కల్పిస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని ప్రభుత్వం విశ్వసిస్తుందన్నారు. పేదలకు సహాయం అందించేందుకు పలువురు ఆసక్తి చూపుతున్నట్టు వెల్లడించారు. ఐవీఆర్ఎస్, వాట్సాప్ క్యూఆర్ కోడ్ ద్వారా ప్రభుత్వ సేవలు, ప్రభుత్వ పనితీరు తదితర అంశాలను విశ్లేషణ చేస్తూ ప్రభుత్వం జిల్లాల వారీగా ర్యాంకులను ప్రకటిస్తుందన్నారు. జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, సీపీవో వెంకటేశ్వర్లు, ఇంటర్మీడియట్ బోర్డు అధికారి వనుము సోమశేఖరరావు, జీఎస్‌డబ్ల్యూఎస్ కోఆర్డినేటర్ ఎస్.త్రినాథరావు, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పీకేపీ ప్రసాద్, డీఐపీఆర్వో కె.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ధరల నియంత్రణలో కీలక పాత్ర పోషించాలి

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరల నియంత్రణలో మార్కెటింగ్, పౌర సరఫరాల శాఖ అధికారులు కీలక పాత్ర పోషించాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో గురువారం ధరల నియంత్రణ మోనటరింగ్ కమిటీ సమావేశం జేసీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ అమలాపురంలో ఇటీవల ఏర్పాటు చేసిన రైతుబజార్‌తో బహిరంగ మార్కెట్‌లో ధరలు తగ్గుముఖం పట్టాయన్నారు. రైతుబజార్ నిర్వహణ తీరును మరింత మెరుగు పరచాలన్నారు. అన్ని రకాల నిత్యావసరాలు, కూరగాయలు ఒకేచోట లభించేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని అన్ని రైతు బజార్లలో ఒకే రకమైన సరసమైన ధరలు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. రైతులు మధ్యవర్తులను ఆశ్రయించకుండా నేరుగా రైతు బజార్లలో విక్రయించాలని సూచించారు. తూనికలు, కొలతల్లో వ్యత్యాసాలను ఉపేక్షించరాదన్నారు. గ్యాస్ డెలివరీ చేసే వ్యక్తులు సిలిండర్‌కు అదనంగా వసూలు చేస్తే కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా సంతృప్తే గీటురాయిగా అధికారులంతా పనిచేయాలన్నారు. సమావేశంలో జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి కె.విశాలాక్షి, డీఎస్‌వో ఎ.ఉదయభాస్కర్, పౌరసరఫరాల సహాయ మేనేజర్ నాగేశ్వరరావు, తూనికలు, కొలతల శాఖ కంట్రోలర్ రాజేష్, ఎస్టేట్ అధికారులు పాల్గొన్నారు.



హరియాణా–బిహార్ జట్ల మధ్య మ్యాచ్





ఆరో రోజూ అదుర్స్..

కాకినాడలో ఉత్సాహంగా కొనసాగుతున్న సివిల్ సర్వీసెస్ హాకీ పోటీలు

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కాకినాడలోని జిల్లా క్రీడా మైదానంలో ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ ఆరో రోజూ ఉత్సాహంగా సాగింది. వివిధ మ్యాచ్‌లు 'అదుర్స్' అనిపించాయి. ఆరో రోజు గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ రాష్ట్రాల మహిళలు, పురుషుల జట్లు మొత్తం 7 మ్యాచ్‌లు జరిగాయి. ఆరో రోజు జరిగిన హాకీ పోటీలకు కాకినాడ జేఎన్‌టీయూ స్పోర్ట్స్ సెక్రటరీ శ్యామ్‌కుమార్, హాకీ ఆంధ్రప్రదేశ్ జనరల్ సెక్రటరీ హర్షవర్ధన్, డీఎస్‌డీవో శ్రీనివాస్‌కుమార్, హాకీ కోచ్ రవిరాజు తదితరులు పాల్గొన్నారు. ఒడిసా, ఉత్తరాఖండ్ సెక్రటేరియట్ మహిళల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఒడిసా 5-0 తేడాతో విజయం సాధించింది. హరియాణా, బిహార్ సెక్రటేరియట్ మహిళల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో హరియాణా సెక్రటేరియట్ 3-2 తేడాతో గెలుపొందింది. తెలంగాణ సెక్రటేరియట్, ఢిల్లీ సెక్రటేరియట్ మహిళల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ సెక్రటేరియట్ 6-0 తేడాతో విజయం సాధించింది. ఆర్ఎస్పీ భువనేశ్వర్, ఆర్ఎస్పీ కొచ్చి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్ఎస్పీ కొచ్చి 5-0 తేడాతో విజయం సాధించింది. గోవా సెక్రటేరియట్, మధ్యప్రదేశ్ సెక్రటేరియట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో మధ్యప్రదేశ్ సెక్రటేరియట్ 4-0 తేడాలో విజయం సాధించింది. ఆర్ఎస్పీబీ రాయపూర్, ఆర్ఎస్పీబీ కాన్పూర్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్ఎస్పీబీ కాన్పూర్ 4-0 తేడాతో విజయం సాధించింది. హరియాణా, ఢిల్లీ సెక్రటేరియట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో హరియాణా సెక్రటేరియట్ 6-1 తేడాతో విజయం సాధించింది.

క్రీడాకారులకు ఆల్ ది బెస్ట్ చెబుతున్న హర్షవర్ధన్





గెలుపు సంబరాలు

ఫిట్‌నెస్సే కారణం



60 ఏళ్ల వయసులో కూడా మేము ఇంకా ఆడుతున్నామంటే దానికి కారణం ఫిట్‌నెస్. క్రీడలు పట్ల మాకున్న మక్కువ మమ్మల్ని ఈ స్థాయికి తీసుకు వచ్చింది. మేమిద్దరం జాతీయ స్థాయిలో 8 నుంచి 10 మ్యాచ్‌లు ఆడాం.

రుబీనా హర్షద్–ఎంపీ టీం కెప్టెన్, అల్కా శర్మ–ఎంపీ టీం ఉమెన్స్ మేనేజర్

కార్పొరేషన్(కాకినాడ), (ఆంధ్రజ్యోతి):



అమ్మతో నేనాడుకుంటా..





టర్ఫ్ గ్రౌండ్ స్పీడ్



టర్ఫ్ గ్రౌండ్ చాలా స్పీడ్‌గా ఉంది. ఆటగాళ్ల కదలికలు కూడా చాలా స్పీడ్‌గా ఉన్నాయి. వేగంగా వచ్చే బాల్‌ని ఆపాలంటే ఏకాగ్రత చాలా అవసరం. ఇటువంటి గ్రౌండ్‌లో ఆటను ఆస్వాదిస్తుంటాం. హాకీ టోర్నమెంట్లకు అనేక రాష్ట్రాలు వెళ్తుంటాం. అయితే కాకినాడలో జరుగుతున్న ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్‌లో క్రీడాకారుల పట్ల మంచి ఆదరణ చూపిస్తున్నారు. ఏర్పాట్లు అన్ని బాగున్నాయి.

నరేష్‌కుమార్ చౌదరి, సీబీడీటీ న్యూఢిల్లీ, మెయిన్ గోల్ కీపర్

టెక్నాలజీ మారింది ఇప్పుడు



మన దేశంలో రాష్ట్రాల మధ్య జరిగే హాకీ టోర్నమెంట్లకు టెక్నాలజీ ఉండేది కాదు. 2023లో కాకినాడ వేదికగా జరిగిన సీనియర్ ఉమెన్ హాకీ టోర్నమెంట్ నుంచి ఈ టెక్నాలజీ ప్రారంభించారు. ఈ టెక్నాలజీ వల్ల ఆడుతున్న జట్లకు ఎటువంటి నష్టం జరగకుండా ఉంటుంది. అలాగే యూట్యూబ్ లింక్ ద్వారా దేశంలో ఏ రాష్ట్రంలో అయిన ఏ గ్రామం నుంచి అయిన ఆడుతున్న మ్యాచ్‌లను లైవ్ చూడవచ్చు. గతంలో మన రాష్ట్రం నుంచి నేనొక్కన్నే టెక్నికల్ ఆఫీసర్‌గా ఉండేవాడిని. ప్రస్తుతం మన రాష్ట్రం నుంచి 15 మంది జాతీయ స్థాయి టెక్నికల్ ఎంపైర్స్‌గా వ్యవహరిస్తున్నారు. జాతీయ స్థాయిలో టాప్ టెన్‌లో నలుగురు ఎంపైర్స్ స్కోరింగ్ జడ్జిలుగా, టెక్నికల్ ఆఫీసర్స్‌గా వ్యవహరిస్తున్నారు. రాబోయే రోజుల్లో వీరంతా అంతర్జాతీయ మ్యాచ్‌లకు కూడా వెళ్లే అవకాశముంది. మన జాతీయ క్రీడ హాకీ అయినా దానికి తగిన ప్రాచుర్యం ఉండడం లేదు. తగిన పబ్లిసిటీ ఇచ్చి గుర్తింపు తెస్తే బాగుంటుంది.

హర్షవర్ధన్, ఆంధ్రప్రదేశ్ హాకీ టీం జనరల్ సెక్రటరీ, ఇంటర్నేషనల్ ఎంపైర్స్ మేనేజర్

రూ.10కే రాగిజావ

రాజమహేంద్రవరం మహిళా ప్రత్యేక కారాగారం ఆధ్వర్యంలో సెంట్రల్ జైలు బయట స్టాల్



సెంట్రల్ జైలు బయట స్టాల్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మహిళా ప్రత్యేక కారాగార అధికారులు అటు మహిళా ఖైదీలకు, ఇటు జనానికి ఉపయుక్తంగా ఉండే విధంగా ఓ చక్కటి ఆలోచన చేశారు. సెంట్రల్ జైలు గేటు వద్ద రాగిజావ స్టాల్‌ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళా జైలు సూపరింటెండెంట్ సీహెచ్ వసంత కుమారి మాట్లాడుతూ.. జైళ్ల శాఖ కోస్తాంధ్ర ప్రాంత డీఐజీ ఎంఆర్ రవికిరణ్ ఆదేశాలతో ఈ స్టాల్‌ని ఏర్పాటు చేశామన్నారు. ప్రతి రోజూ ఉదయం 6గంటల నుంచి 8.30గంటల వరకూ రాగిజావ, ఉడకబెట్టిన వేరుశెనగ, శెనగ, వెజిటెబుల్ సలాడ్‌ని రూ.10కి, బెల్లం రాగిజావ రూ.15కి అందిస్తున్నామన్నారు. మహిళా ఖైదీలతో తయారు చేయించడంతో పాటు విక్రయాలు కూడా వారే చేస్తారని ఆమె చెప్పారు. ఇప్పటికే జైలు బేకరీలో తయారైన బ్రెడ్‌లు, బిస్కెట్లు, సుధార్ పిండి వంటలు ప్రిజన్ కేఫ్‌లోను, ఆరుబయట కూరగాయలు మహిళా ఖైదీలతో విక్రయాలు జరిపిస్తున్నామని చెప్పారు. మహిళా ఖైదీలు విడుదలయిన తర్వాత ఇలాంటి అనుభవం వారి జీవనోపాధికి పని చేస్తుందన్నారు. మహిళా కారాగార ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా మహిళా ఖైదీలను ప్రోత్సహించాలని కోరారు. మంచి ఆహార అలవాట్ల వల్ల ఆరోగ్యకరమైన జీవన విధానం అలవడుతుందని, రోగాలతో ఇబ్బంది పడే పరిస్థితుల నుంచి దూరంగా ఉండొచ్చని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ లక్ష్మీ సూర్య ప్రభ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య, జైలర్ పావని, డిప్యూటీ జైలర్ కె.సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.



కిలో వెండి రూ.లక్ష

- 10 గ్రాముల బంగారం రూ.80,700
- ఆల్‌టైం రికార్డుకు దిశగా వెండి ధర
- ధరల్లో పోటీపడుతున్న బంగారం, వెండి

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఆల్‌టైం రికార్డుకు వెండి ధర చేరింది. వెండి వ్యాపారంలో సువర్ణాక్షరాలతో లిఖించాల్సిన రోజిది. ఊహించినట్టుగానే కిలో వెండి ధర రూ.లక్ష అయింది. రాజమహేంద్రవరం మార్కెట్‌లో గురువారం కిలో వెండి ధర రూ.లక్షగా ఉంది. జనవరి 1న రూ.88,400గా ఉన్న కిలో వెండి ధర 50 రోజుల్లో రూ.11వేల600 పెరిగి రూ.లక్ష అయిపోయింది. లక్షణంగా నిలిచింది. జనవరినుంచి క్రమంగా ఈ ధరలు పెరుగుతూ వస్తున్న సంగతి తెలిసిందే. బంగారం ధరలు కూడా విపరీతంగా పెరిగిపోతున్నాయి. 10గ్రాముల 22 క్యారెట్ బంగారం ధర 80,700 అయింది. 24 క్యారెక్ట్ ధర రూ.88,040 అయింది. మరో రూ.12వేలు పెరిగితే ఇదీ రూ.లక్ష కానుంది. ఈ ధరలు ఇలా విపరీతంగా పెరిగిపోవడంతో వినియోగదారులు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే బాగా కొనుగోలు చేసుకున్నవారు మాత్రం సంతోషంగా ఉన్నారు.

డెల్టా కాలువలకు 8700 క్యూసెక్కులు

ధవళేశ్వరం,ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ నుంచిడెల్టా కాలువలకు 8700 క్యూసెక్కులు విడుదలవుతున్నాయి. తూర్పు డెల్టాకు 2600 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 1700 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 4400 క్యూసెక్కుల చొప్పున జలాలను విడుదల చేస్తున్నారు. ధవళేశ్వరంవద్ద గోదావరినీటిమట్టం స్వల్పంగా పెరుగుదల నమోదు చేసుకుని 9.65 అడుగులకు చేరుకుంది. సీలేరునుంచి విద్యుత్ ఉత్పత్తి ద్వారా 4వేల క్యూసెక్కులు, బైపాస్‌మార్గం ద్వారా 3వేల క్యూసెక్కులు విడుదలవుతుండగా గోదావరిలో నీటి లభ్యత 8700 క్యూసెక్కులుగా ఉంది.

కోనసీమ కపిల్‌దేవ్..

ఇక లేరు

- అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సాత్విక్‌కు పితృవియోగం
- ఖేల్‌రత్న అవార్డు స్వీకరణ చూడకుండానే తనువు చాలించిన కాశీవిశ్వనాథం



అర్జున అవార్డు ప్రకటించినప్పుడు కుమారుడికి స్వీటు తినిపిస్తున్న కాశీవిశ్వనాథం(ఫైల్)

అమలాపురం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఎందరో వ్యాయామ ఉపాధ్యాయులను..వివిధ క్రీడల్లో నైపుణ్యం కలిగిన క్రీడాకారులను తీర్చిదిద్దడంలో నిరంతర శ్రామికుడిగా పేరొందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రంకిరెడ్డి కాశీ విశ్వనాథం గురువారం గుండెపోటుతో మృతి చెందారు. క్రీడలంటే ఆయన ఎంతో మక్కువతో ఉండేవారు. చివరి కోరిక తీరకుండానే తనువు చాలించడం ఆ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. కాశీవిశ్వనాథం పోలికల్లోగానీ, క్రీడా నైపుణ్యంలో ఆయనచూపే ప్రతిభాపాటవాలతో ఆయన్ను కోనసీమ కపిల్‌దేవ్‌గా పిలుస్తారు.

ఆ కోరిక తీరకుండానే..

అమలాపురం పట్టణానికి చెందిన రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్ ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకమైన ఖేల్‌రత్న అవార్డుకు ఎంపికయ్యారు. వివిధ దేశాల్లో జరుగుతున్న బ్యాడ్మింటన్ క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు వెళ్లడం వల్ల ఆ అవార్డును ఇప్పటివరకు ఆయన స్వీకరించలేదు. ఈ అవార్డు స్వీకరణకు గురువారం సాయంత్రం ముహూర్తంగా నిర్ణయించుకున్నారు. ఇప్పటికే సాత్విక్ ఢిల్లీలోనే ఉన్నారు. అవార్డు స్వీకరణ కార్యక్రమాన్ని కనులారా వీక్షించాలని తల్లి రంగమణి, తండ్రి కాశీ విశ్వనాథ్ గురువారం ఉదయం ఢిల్లీ బయలుదేరేందుకు అమలాపురం నుంచి పయనమయ్యారు. కారులో ఎయిర్‌పోర్టుకు బయలుదేరిన కొన్నిక్షణాల్లోనే కాశీవిశ్వనాథం గుండెపోటు రావడంతో హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అప్పటికే తుది శ్వాస విడిచారు. కన్న కొడుకు ఖేల్‌రత్న అవార్డు స్వీకరించే కార్యక్రమాన్ని తిలకించాలనే ఆయన చివరి కోరిక తీరకుండానే మరణించడంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరవుతున్నారు.

కుటుంబ నేపథ్యం..

అమలాపురం పట్టణంలోని గాంధీబజార్‌కు చెందిన రంకిరెడ్డి కాశీవిశ్వనాథ్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పదవీవిరమణ చేశారు. తల్లి రంగమణి జనుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు రామ్‌చరణ్ టెక్సాస్‌లో ఎంఎస్ చేసి ఎయిర్‌లైన్స్‌లో పనిచేస్తున్నారు. చిన్నకుమారుడైన సాత్విక్‌సాయిరాజ్ చదువు కంటే షటిల్ బ్యాడ్మింటన్ ప్రాణంగా భావించి ఎనిమిదేళ్ల పసిప్రాయం నుంచేఆక్రీడకు అంకితమయ్యాడు.

తండ్రే శిక్షకుడు..

సాత్విక్‌కు తండ్రి కాశీవిశ్వనాథం చిన్నతనంనుంచే షటిల్ బ్యాడ్మింటన్‌పై శిక్షణ ఇచ్చారు. కేంద్ర క్రీడామంత్రిత్వశాఖ ప్రకటించిన ఖేల్‌రత్న అవార్డుకు సాత్విక్‌సాయిరాజ్ ఎంపిక కావడం ఎంతో సంతోషం కలిగిందని ఇటీవలే ఓ సందర్భంలో ఆయన వ్యాఖ్యానించారు. క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్ పోటీల్లో ఎందరో క్రీడాకారులను తీర్చిదిద్దిన ఘనత కాశీది. తన వద్ద శిక్షణ పొందిన పద్దెనిమిదిమంది వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పీఈటీలుగా పనిచేస్తున్నారు.

అన్నింటా ఆయనే..

కోనసీమ షటిల్ బ్యాడింట్మన్ అసోసియేషన్ కార్యదర్శిగా, అమలాపురం ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్ కార్యదర్శిగా, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడిగా కాశీవిశ్వనాథం పనిచేస్తున్నారు. రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు, జాతీయ వాలీబాల్ పోటీలు, క్రికెట్ పోటీలకు ఆయనే నాయకత్వం వహించారు.

ఉమ్మడి తూర్పు జిల్లాలో 12 ఎంపీడీవో పోస్టుల ఖాళీలు

మండపేట,ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి సంబంధించి తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, మన్యం జిల్లాల్లో మొత్తం 12 వరకు ఎంపీడీవోల పోస్టులు ఖాళీగా ఉన్నాయని జడ్పీ సీఈవో ఎస్‌వీవీ లక్ష్మణరావు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల ముగిసిన తర్వాత ఆయా మండలాలకు సంబంధించి ఖాళీలను ప్రభుత్వం భర్తీ చేస్తుందన్నారు. జిల్లాలో మండలపరిషత్‌ల పనితీరు మెరుగుకోసం ప్రతినెలా రెండు మండలాల్లో పర్యటించి అక్కడి ప్రగతిని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామన్నారు. మండపేట మండల పరిషత్ కార్యాలయాన్ని సీఈవో గురువారం తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డుల నిర్వహణ తీరు బాగుందని కితాబిచ్చారు. రికార్డుల నిర్వహణ, మండల స్థాయిలో ప్రజలకు అందుతున్న సేవల గురించి

- జడ్పీ సీఈవో లక్ష్మణరావు

ఆరాతీశారు. వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో సత్యనారాయణమూర్తి, కార్యాలయ ఏవో, వెల్లంకి నాగేంద్ర ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ జనార్దన్, జూనియర్ అసిస్టెంట్ గోపాల్ ఉన్నారు.

సామర్లకోట భీమేశ్వరాలయానికి.. 12 నదుల పవిత్ర జలాల చేరిక



పవిత్ర నదుల జలాలను ప్రదర్శనగా తెస్తున్న దృశ్యం

సామర్లకోట, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో ఈ నెల 26న మహాశివరాత్రి సందర్భంగా రాత్రి 10 గంటల నుంచి వేదపండితుల వేదమంత్రోచ్చారణల మధ్య జరగనున్న లింగోద్భవకాల పూజల్లో భీమేశ్వర శివలింగానికి అభిషేకించేందుకు దేశంలోని 12 పవిత్ర పుణ్యనదులనుంచి సేకరించిన పవిత్ర జలాలు గురువారం సాయంత్రం సామర్లకోట ఆలయానికి చేరుకున్నాయి. దేవదాయ శాఖ ఆదేశాల మేరకు ఈ పవిత్ర జలాలతో పిఠాపురంరాజావారి గోత్రనామాలతో స్వామికి అభిషేకించనున్నట్లు ఆలయ ఈవో నీలకంఠం, ఆలయ పండితులుసోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, అంజిబాబు, వెంకన్న తెలిపారు. పవిత్ర జలాలను ఆలయమర్యాదలతో మంగళవాయిద్యాలు వేదమంత్రోచ్చారణలమధ్య ఆలయంలోకి చేర్చి స్వామి గర్భాలయంలో భద్రపరిచారు.

ఐవీఆర్ఎస్ సర్వేలో అన్నవరానికి ఆఖరి స్థానం

అన్నవరం, ఫిబ్రవరి 20: ఆలయాల్లో భక్తులకు సంతృప్తికరమైన సేవలందించాలనే ఉద్దేశ్యంతో ఇటీవల ప్రభుత్వం ఆలయాల్లోని ముఖ్య కూడళ్లవద్ద క్యూఆర్ కోడ్ ప్రవేశపెట్టి భక్తుల చరవాణిల ద్వారా వివరాలు సేకరించారు. అనంతరం ఐవీఆర్ఎస్ సర్వే చేపట్టగా అన్నవరం దేవస్థానం చివరి స్థానంలో నిలిచింది. తొలి దశలో ఏడు ప్రధాన దేవాలయాల్లో వీటిని ఏర్పాటు చేసి సర్వే చేపట్టగా అన్నవరం దేవస్థానం 7వ స్థానంలో నిలిచింది.

పనిచేసేవారే..

వర్సిటీలో ఉంటారు



వీసీకి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలుకుతున్న రిజిస్ట్రార్ సుధాకర్

- బాధ్యతలు స్వీకరించిన నన్నయ వీసీ ప్రసన్నశ్రీ
- కళలకు ప్రోత్సాహం.. పరిశోధనలకు ప్రాధాన్యం
- నైపుణ్యాభివృద్ధిని విద్యార్థులకు చేరువ చేస్తా
- ఆంధ్రజ్యోతి ప్రత్యేక ఇంటర్వ్యూలో వెల్లడి

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఆమె గిరిజన కుటుంబంలో పుట్టారు. కష్టపడి చదువుకున్నారు. 23భాషలు మాట్లాడతారు. ఇంతింతై అన్నట్టు ఎన్నో పదవులను చేపట్టి నన్నయ వర్సిటీ ఉపకులపతిగా ఆచార్య సత్తుపాటి ప్రసన్నశ్రీ నియమితులయ్యారు.ఈ ప్రయాణంలో ఆమె పడిన కష్టాలు.. వర్సిటీని ఉన్నత స్థాయికి తీసుకువెళ్లడంలో ఏ విధమైన ప్రణాళికతో ముందుకు వెళ్తారు? అనే అంశాలపై గురువారంబాధ్యతలు స్వీకరించిన ఆమెను ఆంధ్రజ్యోతి పలకరించగా ఇలా చెప్పుకొచ్చారు.

రాజమహేంద్రవరం కోడలినే..

నన్నయ వీసీగా రావడం ఆనందంగా ఉంది. నేను రాజమండ్రి కోడలినే. మా మామగారు.. మా అల్లుడు ఈ ప్రాంతంవారే. మంచితనం, ప్రేమ, ఆదరణ, మర్యాదలకు ఈ ప్రాంతం పెద్దపీట వేస్తుందని అందరికీ తెలిసిన సత్యమే. నాకు కళలంటే ఇష్టం.. సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరంలో అవకాశంమేరకు కళలు ప్రోత్సహించేందుకు కృషి చేస్తా.

పనిచేసేవారు మాత్రమే ఉంటారు..

నాసిబ్బందే నా కుటుంబం. నేను పనిచేస్తాను.. సిబ్బంది అందరితో పనిచేయిస్తా. పనిచేసేవారు మాత్రమే విశ్వవిద్యాలయంలో ఉంటారు. పనిదొంగలను ఉంచుకునే అవకాశమే లేదు. పనిచేసే వారికి తొలి ప్రాధాన్యం. వర్సిటీ గురించి అంతా తెలుసుకునే వచ్చా. నాకేం తెలియదని అనుకోవద్దు.

ఇక్కడా పరిశోధనలు చేస్తా..

విశ్వవిద్యాలయంలోని వనరులను పరిశీలించి ఇక్కడి పరిస్థితులను ఆకళింపు చేసుకున్నాక పరిశోధనలను ప్రోత్సహించే విషయమై దృష్టిసారిస్తా. పరిశోధనలు చేసేందుకు ఇక్కడగల అవకాశాలు, సంభావ్యత, వాటివల్ల ఈ ప్రాంతానికి ఎంత మేరకు మేలు జరుగుతుంది మొదలైన విషయాలను పరిశీలించి పరిశోధనల వైపు దృష్టిసారిస్తా.

గిరిజన మహిళకు తొలి అవకాశం

రాష్ట్రం ఏర్పడిన తర్వాత గిరిజన మహిళను విశ్వవిద్యాలయానికి ఉపకులపతిగా తొలిసారిగా కూటమి ప్రభుత్వం నియమించింది. ప్రతిభ ఆధారంగా వీసీలను నియమించామని తెలుపుతూ తనగురించి సీఎంచంద్రబాబు ప్రస్తావించడం ఎంతో సంతోషం కలిగించింది. నాకు ఇచ్చిన ఈ అవకాశంతో మూడేళ్లపాటు వీసీగా మరింత బాధ్యతగా పనిచేస్తా.

గిరిజన బిడ్డగా కష్టం విలువ తెలుసు

గుంటూరు జిల్లా స్టూవర్టుపురం గిరిజన ప్రాంతంనుంచివచ్చా. చదువుకోవడానికే ఎన్నో కష్టాలుపడ్డా. అన్నీఎదుర్కొని నేడు వీసీగా ఎదిగా. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో కష్టాలను అధిరోహించి ఉన్నతస్థానాలకు చేరుకోవాలి. గిరిజన బిడ్డగా కష్టం విలువతెలిసిన నేను తోటి మనిషికి సాయం చేయడానికి ముందుంటా.

19 గిరిజన భాషలకు లిపి రూపొందించా..

నేను 23 భాషలు మాట్లాడతా. ఆదివాసీల కోసం 19గిరిజన భాషలకు లిపి రూపొందించా.ఆ సందర్భంలో ఎన్నో అనుభవాలు ఎదురయ్యాయి. నీ కాళ్లల్లో ఎన్ని ముళ్లు గుచ్చుకున్నాయో అంటూ మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం నన్ను ఉద్దేశించి ఒక సందర్భంలో అనడం మర్చిపోలేను.

వీసీగా ప్రసన్నశ్రీ బాధ్యతల స్వీకరణ

అందరి సహకారంతో నన్నయ విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఉపకులపతి ఆచార్య సత్తుపాటి ప్రసన్నశ్రీ అన్నారు. నన్నయ విశ్వవిద్యాలయంలో వీసీగా గురువారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. నన్నయ, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, ప్రార్థనల మధ్య బాధ్యతలు స్వీకరించారు. అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, నన్నయ కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్‌ల అధ్యాపకులు, నన్నయ అనుబంధ కళాశాలల నిర్వాహకులు వీసీకి శుభాకాంక్షలు తెలిపారు.

అర్ధరాత్రి దారి కాచి... మెడపై కత్తి పెట్టి!

● బైక్‌తో సహా మూడు సెల్‌ఫోన్లు ఎత్తుకుపోయిన నలుగురు దారి దోపిడీ దొంగలు అరెస్ట్

● చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్న సర్పవరం పోలీసులు


నిందితులతో సర్పవరం సీఐ పెద్దిరాజు

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని అర్ధరాత్రి దారి కాచి మెడపై కత్తి పెట్టి బెదిరింపులకు గురి చేసి బైక్‌తో సహా మూడు సెల్‌ఫోన్లు ఎత్తుకుపోయిన నలుగురు దొంగలను సర్పవరం పోలీసులు అరెస్ట్ చేసి, నిందితుల నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. గురువారం సర్పవరం సీఐ బి.పెద్దిరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడ శ్రీనగర్‌కు చెందిన సత్తి వివేకానందరెడ్డి ఆదిత్య కాలేజీహాస్టల్‌లో ఆఫీస్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 17వ తేదీ అర్ధరాత్రి టీ తాగేందుకు బైక్‌పై డీమార్ట్ ప్రాంతానికి వెళ్లగా, టీ కొట్టు మూసి వేసి ఉండడంతో దుమ్ములపేట డైరీఫారమ్ సెంటర్ వైపు సూర్య బార్ రెస్టారెంట్ ప్రాంతానికి వెళ్లాడు. అక్కడ మార్గమధ్యలో కాకినాడ డైరీ ఫారమ్ సెంటర్‌కు చెందిన యెలెపే మెగా శ్యామ్, రామకృష్ణారావుపేటకు చెందిన డెక్కాతి ఎల్లయ్య, సంజయ్‌నగర్ పర్లోపేటకు చెందిన కొత్తూర్తి వీరబాబు, రామకృష్ణారావుపేటకు చెందిన షేక్ ఇబ్రహీమ్‌లు అనే నలుగురు యువకులు దారికి అడ్డంగా నిలబడి బైక్‌ను ఆపారు. బాధితుడు నుంచి బైక్ తాళం లాక్కుని, బెదిరించి మెడపై కత్తి పెట్టి మోటార్ సైకిల్‌పై అక్షర స్కూల్ ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ చంపుతామని బెదిరించి దాడి చేసి అతడి వద్ద ఉన్న బైక్, శ్యామ్‌సంగ్ ఎఫ్ 40 సెల్‌ఫోన్, రెండు రెడ్‌మీ ఫోన్లు, బోట్ కంపెనీ ఇయర్ బడ్స్ దౌర్జన్యంగా లాగేసుకుని పరారయ్యారు. బాధితుడు 18వ తేదీన సర్పవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్‌డీపీవో నేతృత్వంలో సర్పవరం సీఐ బి.పెద్దిరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నలుగురు నిందితులు కాకినాడ దుమ్ములపేట కూరకాయల మార్కెట్ వద్ద ఉండగా పోలీసులు దాడి చేసి పట్టుకుని అరెస్ట్ చేశారు. చోరీ సొత్తు స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు. నిందితులను చాకచక్యంగా సత్వరంగా పట్టుకుని చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్న ఎస్ఐ శ్రీనివాస్, క్రైం సిబ్బంది, ఏఎస్ఐ నాగేశ్వరరావు శ్రీనివాస్, హెచ్‌సీలు సత్తిబాబు, రాజు, గణేష్, ప్రసాద్, పీసీలు వెంకటరత్నం,దుర్గాప్రసాద్, అనిల్, కిషోర్‌ను జిల్లా ఎస్పీ అభినందించారు.

పోలవరం ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలి

కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసిన ఏపీ ప్రభుత్వ పెద్దలు


ఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రిని కలిసిన సీఎం, డిప్యూటీ సీఎం, ఎంపీలు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గోదావరి వరదల అనంతరం జాప్యం లేకుండా పోలవరం ప్రాజెక్టు పనులు వేగవంతంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఏపీ ప్రభుత్వ పెద్దలు కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఢిల్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, రాజ్యసభ ఎంపీ సానా సతీష్‌బాబు తదితరులు జలశక్తి మంత్రిని కలిశారు. పోలవరంతో పాటు రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టులపై చర్చించారు. పోలవరం ప్రాజెక్టు పనుల పునఃప్రారంభానికి నిధులు విడుదల చేయాలని కోరారు. ఏపీ అభివృద్ధి పోలవరం ప్రాజెక్టుతో ముడిపడి ఉందని వివరించారు. అపారమైన జలవనరులు ఆంధ్ర రాష్ట్రంలో ఉన్నందున వాటిని సద్వినియోగం చేసుకునేలా సహకరించాలని మంత్రిని కోరారు.

ఒకరి పాపం 12 మందికి చుట్టుకుంది!

● బయటపడుతున్న కాకినాడ జీజీహెచ్ మేనేజర్ లీలలు ● విధుల నుంచి చిరుద్యోగుల తొలగింపు

జీజీహెచ్ (కాకినాడ), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో పరిపాలనా విభాగ మేనేజర్‌గా పనిచేసిన నరసింగరావ్ అప్పట్లో చేసిన పాపం 12 మంది చిరుద్యోగులకు చుట్టుకుంది. శాఖాపరమైన విచారణ, దర్యాప్తు అనంతరం ఆ చిరుద్యోగులను గురువారం విధుల నుంచి తొలగించారు. 2020-2021లో కొవిడ్ నియంత్రణలో లేని సమయంలో తన తెలివితేటలతో లేని ఉద్యోగాలను సృష్టించి జీజీహెచ్‌లో నియామక ప్రక్రియకు తెరతీసిన మేనేజర్ నరసింగరావును అధికారులు విచారణానంతరం సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. అయితే ఆయన పై అధికారిణి (రాజమహేంద్రవరం) శాఖాపరంగా ఆయనపై సరైన చర్యలు చేట్టకపోవడంతో ఆయన త్వరలోనే తిరిగి ఉద్యోగం పొందేందుకు పావులు కదుపుతున్నాడు. అయితే నరసింగరావ్ చేసిన పాపానికి 12 మంది బలవ్వడం మిగతా ఉద్యోగులను, ఉద్యోగ సంఘాలను కలచి వేసింది. ఉద్యోగం కోల్పోయినవారిలో ఇద్దరు రెగ్యులర్ ఫార్మసిస్టులు, మరో ఇద్దరు కాంట్రాక్ట్ ఫార్మసిస్టులు, ఇద్దరు ఫిజియోథెరపిస్టులు, నలుగురు ల్యాబ్ టెక్నీషియన్‌లు, ఒక థియేటర్ అసిస్టెంట్, ఒక ఎలక్ట్రీషియన్ ఉన్నారు. ఈ విషయంపై అధికారులు తొలగింపునకు గురైన వారి కోసం కలెక్టర్‌కు విన్నవించగా వారికి మరి ఎక్కడైనా నియామకం చేపట్టే అవకాశం గురించి పరిశీలించాలని డీఎంహెచ్‌వోకు సూచించారు. ఈ విషయంపై జీజీహెచ్ అధికారులు, ట్రెజరీ అధికారులతో కలెక్టర్ అత్యవసర సమావేశం నిర్వహించారు. చిరుద్యోగుల జీవితాలతో ఆడుకుని సస్పెండ్‌కు గురైన నరసింగరావును పూర్తిగా ఉద్యోగం నుంచి తొలగించాలని పలు ఉద్యోగసంఘాలు కోరుతున్నాయి.

డిప్యూటీ సీఎం పవన్‌పై అనుచిత పోస్టులు

కేసు నమోదు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర, తప్పుడు పోస్టులు పెడితే ఉపేక్షించబోమని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ హెచ్చరించారు. డిప్యూటీ సీఎం పవన్ కుటుంబ సభ్యులతో కుంభ మేళాలో పుణ్యస్నానాలు ఆచరించిన విషయం తెలిసిందే. ఈ ఫొటోలను కొందరు మార్ఫింగ్, బాడీ షేమింగ్ చేయడంతోపాటు, మహిళలను కించపరిచే విధంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారంటూ జనసేన నాయకులు ఫిర్యాదు చేశారని ఎస్పీ తెలిపారు. భార్గవ్.ఆర్, ఎస్‌వోఆర్ భక్తుడు, దిలోన్ వోల్ఫ్10 ఐడీల నుంచి ఉన్న పోస్టుల ఫొటోలను ఫిర్యాదుతో జత చేయడం జరిగిందన్నారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో నిందితులను గుర్తించి కోర్టులో ప్రవేశ పెడతామన్నారు.

ముగిసిన ఆక్టోపస్ శిక్షణ

జీజీహెచ్ (కాకినాడ), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాద నిరోధక సంస్థ అయిన ఆక్టోపస్ కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో చేపట్టిన 2 రోజుల శిక్షణ గురువారంతో ముగిసింది. 40 మంది కమాండోలు ఈ శిక్షణలో పాల్గొన్నారు. ఆక్టోపస్ అడిషనల్ ఎస్పీ సి.రాజారెడ్డి నేతృత్వంలో ఆర్ఐలు ఎస్.మురళీకృష్ణ, కె.మహేష్ ఆధ్వర్యంలో ఉగ్రవాదులు దుశ్చర్యలకు పాల్పడితే తిప్పి కొట్టే విధానాలపై ప్రయోగాత్మకంగా శిక్షణ ఇచ్చారు. ఆర్ఎంసీ ప్రిన్సిపాల్, డీఎంఈ, డా.ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డా.డిఎస్‌విఎల్ నరసింహం ఆదేశానుసారం వైస్ ప్రిన్సిపాల్ డా.శశి, ఫోరెన్సిక్ అసోసియేట్ ప్రొఫెసర్ డా పి. ఫణికిరణ్, ఆర్ఎంసీ లైబ్రేరియన్ లక్ష్మణ్ రెడ్డి, కళాశాల తరుపున శిక్షణా కార్యక్రమ నిర్వహణ బాధ్యతలను చేపట్టారు. ఇలాంటి ఉన్నత విద్యను అందించే కళాశాలల్లో ఇటువంటి శిక్షణలనివ్వడం తప్పనిసరి అని ఏఎస్పీ పేర్కొన్నారు.

భర్తను కాదనుకొని.. మరొకరితోనూ పొసగక!

ఉరి వేసుకొని మహిళ మృతి

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని మంచిర్యాలకు చెందిన ఓ మహిళకు అదే ప్రాంతానికి చెందిన దేవయ్యతో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. కుమారుడు, కుమర్తె ఉన్నారు. మూడేళ్ల క్రితం భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో ఆమె పిల్లలను తీసుకొని పుట్టింటికి వెళ్లిపోయింది. ఏడాది తర్వాత రాజమండ్రికి చెందిన అవివాహితుడు శరత్ కుమార్‌తో సామాజిక మాధ్యమం ద్వారా పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం ఏడాది కొనసాగిన తర్వాత ఆమె పిల్లలను తీసుకుని రాజమండ్రి వచ్చేసింది. అప్పటి నుంచి హౌసింగ్ బోర్డులో అద్దెకు తీసుకున్న ఇంట్లో ఆమె, శరత్ కుమార్ సహజీవనం చేస్తున్నారు. అయితే 3 నెలల నుంచీ వీరి మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో తాను చచ్చిపోతానంటూ శరత్‌తో చెప్పింది. గొడవ జరిగినప్పుడు ప్రతిసారీ ఆమె అలా బెదిరించడంతో ఇప్పుడు కూడా అదే మాదిరి అనుకొని శరత్ కుమార్ ఉద్యోగానికి వెళ్లిపోయాడు. గురువారం మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చేసరికి ఆమె ఉరికి వేలాడుతూ ఉంది. బొమ్మూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శానిటరీ మేస్త్రీపై వ్యక్తి దాడి

పిఠాపురంలో విధులు బహిష్కరించి పారిశుధ్య కార్మికుల ఆందోళన


పిఠాపురంలో ఆందోళన నిర్వహిస్తున్న పారిశుధ్య సిబ్బంది, కార్మికులు

పిఠాపురం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలో విధుల్లో ఉన్న శానిటరీ మేస్త్రీపై ఒక వ్యక్తి దాడి చేయడంతో పాటు వెంబడించి మరీ మరోమారు దాడి చేశాడు. ఈ సంఘటనకు నిరసనగా పారిశుధ్య కార్మికులు గురువారం విధులు బహిష్కరించి ఆందోళనకు దిగారు. పిఠాపురం మున్సిపల్ కార్యాలయంలో శానిటరీ మేస్త్రీగా పనిచేస్తున్న పొట్నూరి పైడిరాజు 24వ వార్డు పక్కలు మర్రిచెట్టు ఏరియాలో జరుగుతున్న పారిశుధ్య కార్యక్రమాలను బుధవారం సాయంత్రం పర్యవేక్షిస్తున్నారు. ఆ సమయంలో నాగేశ్వరరావు అనే వ్యక్తి వచ్చి దాడి చేయడంతో పాటు కులదూషణకు దిగాడు. అక్కడ నుంచి చెత్త తీసుకువెళ్తున్న ట్రాక్టర్‌ను వెంబడించి వచ్చి మరీ మున్సిపల్ కార్యాలయం వద్ద మరోమారు దాడికి దిగాడు. ఈ సంఘటనపై పైడిరాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మేస్త్రీపై దాడి ఘటనకు నిరసనగా మున్సిపల్ పారిశుధ్య విభాగం సిబ్బంది, కార్మికులు గురువారం విధులు బహిష్కరించారు. దాడి చేసిన వ్యక్తిని తక్షణం అరెస్టు చేయాలని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పిఠాపురం మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళనకు దిగారు. అతడిని అరెస్టు చేసే వరకూ తాము విధులకు హాజరుకాబోమన్నారు. వారి ఆందోళనతో పిఠాపురం పట్టణంలో పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ నిలిచిపోయింది. ఎక్కడ చెత్తాచెదారం అక్కడే ఉండిపోయింది.

తల్లి మరణించడంతో... మనస్తాపానికి గురై!

విశ్రాంత ఉద్యోగి ఆత్మహత్య

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత కారణాలతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ విశ్రాంత ఉద్యోగి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం కాకినాడలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. స్థానిక నరసన్నగర్, సిరి అపార్ట్‌మెంట్‌కు చెందిన గోపిశెట్టి నాగేశ్వరరావ్ (65)కు భార్య విజయలక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కాగా నాగేశ్వరరావ్ కాకినాడ పశుసంవర్థక శాఖ కార్యాలయంలో టెక్నీషియన్‌గా పని చేసి 5 ఏళ్ల క్రితం ఉద్యోగ విరమణ పొందాడు. కుమారుడు, కుమార్తె విదేశాల్లో స్థిరపడడంతో నాగేశ్వరరావు తన భార్య విజయలక్ష్మితో కలిసి కాకినాడలో ఉంటున్నారు. అయితే ఇటీవల నాగేశ్వరరావ్ తల్లి మరణించడంతో తల్లితో ఎంతో అనుబంధం ఉండడంతో తీవ్ర మనస్తాపానికి గురై అతడిలో అతడే మదనపడిపోయి, పరాకు మాట్లాడేవాడు. ఈ నేపథ్యంలో విజయలక్ష్మి తన భర్తను మానసిక వైద్యుడికి చూపిద్దామనుకున్న తరుణంలో గురువారం ఆమె నిద్రిస్తున్న సమయంలో నాగేశ్వరరావ్ గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు బెల్టుతో ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అది గమనించిన విజయలక్ష్మి పొరుగింటి వారి సహాయంతో జీజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. టూటౌన్ ఎస్ఐ ఎం వెంకటేశ్వరరావ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్య, మామపై కత్తితో దాడి

● దురాగతానికి పాల్పడ్డ అల్లుడు

● అక్కడికక్కడే భార్య మృతి, మామకు తీవ్ర గాయాలు

● కుటుంబ కలహాలే కారణం


రక్తపు మడుగులో పడివున్న కృష్ణతులసి మృతదేహం

కొవ్వూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో భార్యను, మామను కత్తితో అల్లుడు దాడిచేసిన సంఘటన తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం వాడపల్లి బంగారమ్మపేటలో గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే. కొవ్వూరు మండలంలోని వాడపల్లి బంగారమ్మపేటకు చెందిన అడ్డాల నాగయ్యకు నలుగురు ఆడపిల్లలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిలో పెద్ద కుమార్తె, కుమారుడు అనారోగ్యంతో మృతిచెందగా, మిగతా ముగ్గురు ఆడపిల్లలు, కుమారుడు ఉన్నారు. ఇందులో మూడో కుమార్తె గంధ్ర కృష్ణతులసి (37)కు కృష్ణా జిల్లా తిరువూరు సమీపంలోని రాజుగూడెంకి చెందిన గంధ్ర మురళీకృష్ణ చౌదరితో 16 సంవత్సరాల క్రితం రెండో వివాహం జరిగింది. అయితే మురళీకృష్ణ, కృష్ణతులసి కొంత కాలం సఖ్యంగానే ఉన్నారు. అనంతరం గొడవలు జరగ్గా కృష్ణతులసి పుట్టింటికి వచ్చేసింది. గత నాలుగు నెలలుగా భార్యాభర్తలు విడివిడిగా ఉంటున్నారు. మురళీకృష్ణ బంగారంపేట గోదావరి ఏటిగట్టుపై వద్ద గల బస్‌షెల్టర్ పక్కన కొబ్బరి బొండాల షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం ఐదు గంటల సమయంలో తండ్రి నాగయ్యతో కలిసి కృష్ణతులసి గోదావరి ఏటిగట్టు కింద కట్టిన గేదెల వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా, కొబ్బరి బొండాల షాపు వద్ద ఉన్న భర్త మురళీకృష్ణను చూసి తన తండ్రి వద్ద గతంలో అప్పుగా తీసుకున్న డబ్బులు ఇవ్వాలని కోరింది. దీంతో ఇరువురి మధ్య మాటామాటా పెరగడంతో కోపోద్రిక్తుడైన మురళీకృష్ణ తన చేతిలో ఉన్న కొబ్బరి బొండాల కత్తితో దాడి చేయగా కృష్ణతులసి అక్కడికక్కడే మృతిచెందింది. ఆ తర్వాత వచ్చిన మామ నాగయ్యనూ మెడపై కత్తితో దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికుల సమాచారం మేరకు కొవ్వూరు డీఎస్పీ జీ. దేవకుమార్, పట్టణ ఎస్ఐ కె. జగన్మోహనరావు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన నాగయ్యను 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ఆసుపత్రి లో చేర్పించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కృష్ణతులసికి మొదటి భర్తకు ఒక కుమారుడు ఉన్నాడు. పని నిమిత్తం భీమవరం వెళ్లాడు. మృతురాలి సోదరుడు అడ్డాల సూర్యభాస్కర్ అందించిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


అడ్డాల నాగయ్య

చైతన్యరాజుకు మాతృవియోగం

●నివాళులర్పించిన ప్రముఖులు


లక్ష్మీకాంతమ్మ

అమలాపురం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కిమ్స్ వైద్య విద్యాసంస్థల అధినేత కలిదిండి వీరవెంకట సత్యనారాయణరాజు (చైతన్యరాజు)కు మాతృవియోగం కలిగింది. ఆయన తల్లి లక్ష్మీకాంతమ్మ (87) గురువారం మధ్యాహ్నం అమలాపురంలోని కిమ్స్ వైద్యకళాశాలలో ఆకస్మికంగా మృతిచెందా రు. ఆమె భర్త సత్యనారాయణరాజు ఇదివరకే మరణించారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం ఉన్నారు. వారిలో చైతన్యరాజు పెద్దకుమారుడు. కాగా రెండో కుమారుడైన వెంకట్రామరాజు కొంతకాలం క్రితం మృతిచెందారు. ఆమెకు వరలక్ష్మి, పార్వతి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వృద్ధాప్యంలో ఉన్న లక్ష్మీకాంతమ్మ కిమ్స్‌లోని వైద్యుల సంరక్షణలోనే కొన్నిరోజులుగా ఉన్నారు. లక్ష్మీకాంతమ్మ భౌతికకాయానికి శుక్రవారం రాజమహేంద్రవరంలోని గోదావరి నదీ తీరాన అంత్యక్రియలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. లక్ష్మీకాంతమ్మ మరణ వార్త తెలిసిన వెంటనే ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, ప్రముఖులు పెన్మెత్స జగ్గప్పరాజు, దంతులూరి వాసురాజు, బీజేపీ నాయకులతో సహా అనేకమంది పరామర్శించి లక్ష్మీకాంతమ్మ భౌతికకాయానికి నివాళులర్పించారు.

దేవరపల్లిలో జర్మన్ ప్రతినిధుల బృందం

● మండలంలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల సందర్శన


పల్లంట్లలో ఆకుకూరలు సాగు చేస్తున్న సత్యవర్థినిని వివరాలు అడుగుతున్న బృంద సభ్యులు

దేవరపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలో జర్మన్ ప్రతినిధుల బృందం గురువారం పర్యటించింది. దేవరపల్లి మండలంలోని పల్లంట్ల, యర్నగూడెం, కురుకూరులో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల్లో పండించే పంటల గురించి ఆ బృందం సభ్యులు రైతులను అడిగి తెలుసుకున్నారు. నలుగురు సభ్యులతో కూడిన ఈ బృందంలో ఫౌండేషన్ ఆన్‌ఫ్యూచర్ ఫార్మింగ్ తరపున జాస్పర్ జోర్డాన్, బెన్నెడిక్ట్ హెర్లిన్, పోర్చుగల్‌కు చెందిన ప్రాజెక్టు ఎర్త్ ప్రతినిధి డియోగో కౌటినో, అటెలియర్‌ఫుడ్ సిస్టమ్ చేంజ్ ప్రతినిధి లూకస్ కేహ్లే ఉన్నారు. దీనిలో భాగంగా యర్న గూడెంలో రైతు గద్దే మునేశ్వరరావు తన తొమ్మిది ఎకరాల్లో పప్పు ధాన్యాలు, 35 ఎకరాల్లో ఆయిల్‌పామ్‌ను సాగు చేస్తున్న పొలాలను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ సాగు పాటించడానికి మీ లక్ష్యమేమిటని అడిగారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ప్రజారోగ్యాన్ని కాపాడటంతో పాటు భూసారాన్ని పెంపొందిం చుకోవచ్చని, అలాగే తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించవచ్చని రైతు మునేశ్వరరావు జర్మన్ బృందానికి తెలిపారు. తమ ప్రకృతి వ్యవసా యం ద్వారా పండించే పంటకు స్వయంగా ప్రకృతి సాగు పదార్థాలైన ద్రవజీవామృతం తయారు చేసుకోవడం, డ్రోన్ పిచికారీ సాంకేతికత జర్మన్ బృందాన్ని ఆకట్టుకుంది. పల్లంట్లలో ప్రకృతి వ్యవసాయం ద్వారా కౌలురైతు సీహెచ్. సత్యవతి ఎకరం భూమిని కౌలుకు తీసుకుని అన్ని రకాల ఆకుకూరలు, ప్రకృతి వ్యవసాయాన్ని అనుసరిస్తూ అధికలాభాలు సాధిస్తున్న అంశాన్ని జర్మన్ బృందాన్ని ఆకట్టుకుంది. వీరితోపాటు రైతు సాధికార సంస్థ సీనియర్ అధికారులు ప్రకాశ్‌రావు, శ్రీనివాసరావు, ఏపీసీఎన్‌ఎఫ్ అదనపు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వలి, హుమాయున్, యశ్వంత్‌రెడ్డి, దేవరపల్లి మండల ప్రకృతి వ్యవసాయ శాఖ ప్రతినిధులు సీతాదేవి, రామలక్ష్మి, వెంకటలక్ష్మి, తదితరులు ఉన్నారు.

వృద్ధ దంపతులను మభ్యపెట్టి... ఆపై బంగారం దోచుకెళ్లి

● నిందితుడి అరెస్టు


దొంగను అరెస్టు చేసిన ఎస్ఐ

కొత్తపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట శివారు పనసలదొడ్డికి చెందిన గుబ్బల వెంకటేశ్వరరావు ఇంటికి ఒక అగంతకుడు వచ్చి మీకు బియ్యం యోజన కింద లోన్ వచ్చిందని, తాను సచివాలయం నుంచి వచ్చానని చెప్పి నమ్మబలికాపు. దాంతో వారిద్దరినీ ఆ అగంతకుడు మోటార్ సైకిల్‌పై ఎక్కించుకుని స్థానిక కమ్మిరెడ్డిపాలెం మసీదుసెంటర్‌కు తీసుకొచ్చి దించాడు. ఇక్కడే కూర్చోండి మీ ఇంటికి వెళ్లి ఆధార్ జిరాక్స్ తీసుకుని వస్తానని తిరిగి మళ్లీ పనసల దొడ్డిలో వారు ఉంటున్న ఇంటికి వెళ్లాడు. మీ నాన్నకు లోను వచ్చిందని మీ ఆధార్‌కార్డు, ఫొటో కావాలని వారి కుమార్తెను అడగ్గా ఆమె ఆధార్‌కార్డు తెచ్చిఇచ్చింది. ఫొటో లేదని చెప్పగా , అయితే నేను ఫొటో తీసుకుంటానని చెప్పి మీ మెడలో ఉన్న చైన్, ఉంగరం ఫొటోలో రాకూడదు, వాటిని తీసి పక్కన పెట్టమని చెప్పాడు. ఆ తర్వాత ఫొటో తీసినట్టు నమ్మించి పక్కన పెట్టిన కాసు బంగారం చైను, అరకాసు ఉంగరాన్ని జేబులో పెట్టుకుని అక్కడ నుంచి పరారయ్యాడు. దీంతో మోసం జరిగిందని గ్రహించిన వృద్ధ దంపతులు కొత్తపేట పోలీసులకు సమాచారం అందించారు. సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడు రాజోలు మండలం శివకోడుపాలానికి చెందిన యల్లమిల్లి వెంకటరమణ అలియాస్ గ్రాబియేల్, అలియాస్ కిషోర్‌గా గుర్తించారు. నిందితుడ్ని బుధవారం రాత్రి బోడిపాలెం వంతెన సమీపంలో పట్టుకుని బంగారాన్ని రికవరీ చేసి అరెస్టు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. కాగా నిందితుడిపై గతంలో ఈ ప్రాంతంలోనే ఇటువంటి చోరీలకు సంబంధించి 22 కేసులు ఉన్నాయని ఎస్ఐ చెప్పారు.

విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి


నాగేంద్ర మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

గండేపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం యల్లమిల్లి గ్రామపరిధిలోని ఒక పొలంలో రంగంపేట మండలం పెద రాయవరం గ్రామానికి చెందిన కాకర్ల నాగేంద్ర (34) విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. పోలీసుల సమాచారం ప్రకారం నాగేంద్ర రాయవరం గ్రామం నుంచి పశు గ్రాసం కోసం వచ్చి కోసుకుని మోపులు తీసుకుని వెళ్తుండగా, పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ వైర్లు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసు సిబ్బంది, ఎలక్ట్రికల్ ఏఈ కిరణ్‌సాగర్ అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం తరలించినట్టు ఎస్ఐ శివనాగబాబు తెలిపారు.నాగేంద్రకు భార్య మహేశ్వరి, కూతుళ్లు మోక్షశ్రీ, శ్రీలక్ష్మీసుకన్య ఉన్నారు. కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు. విద్యుత్ శాఖ అధికారులు వైర్లు చేతికందే ఎత్తులో లేకుండా తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కుమారపురంలో కత్తితో దాడి : ఒకరికి గాయాలు


గాయపడిన శ్రీనివాసరావు

పిఠాపురం రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం కుమారపురంలో కత్తితో చేసిన దాడిలో ఒక వ్యక్తికి గాయాలయ్యాయి. వివరాలివి. గ్రామానికి చెందిన బీ.రామకృష్ణ భార్యను అదే గ్రామానికి చెందిన టీ.అనంతయ్య పరుష పదజాలంతో దూషిస్తున్నాడు. అయితే అటుగా వెళుతున్న రామకృష్ణ సోదరుడు శ్రీనివాసరావు అతన్ని వారించే ప్రయత్నం చేయగా, ఇరువురు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో ఆగ్రహించిన అనంత య్య ఇంట్లో నుంచి కత్తి తెచ్చి శ్రీనివాసరావుపై దాడికి పాల్పడ్డాడు. ఈ సంఘటనలో శ్రీనివాసరావు తలపై తీవ్రగాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. రూరల్ ఎస్ఐ గుణశేఖర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన
అయినవిల్లి, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల విస్తరణాధికారి వాణిశ్రీ బెహరా ఆధ్వర్యంలో గురువారం తడిచెత్త పొడిచెత్త నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. తడిచెత్త, పొడి చెత్త వల్ల కలిగే లాభాలను వివరించారు. వర్మి కంపోస్టు, సేంద్రీయ ఎరువుల తయారీ చేయవచ్చునన్నారు.

స్కౌట్ అండ్ గైడ్స్ ఉద్యమం
అయినవిల్లి,ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి):సిరిపల్లి జయంతి రామయ్య పంతులు ఉన్నత పాఠశాలలో హెచ్ఎం నిమ్మకాయల గణేశ్వరరావు అధ్యక్షతన స్కౌట్ అండ్ గైడ్స్ ఉద్యమాన్ని ప్రారంభించారు. 32మంది స్కౌట్‌లతో పాటు స్కౌట్ ఉపాధ్యాయుడు డి.సత్యనారాయణ, మాజీ శిక్షకురాలు బీవీవీ కుమారి, షేక్ అంజానీలను సత్కరించారు.

ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక తనిఖీలు

● హైజనిక్ లోపాలు, అపరిశుభ్ర పరిసరాలపై ఆగ్రహం ● తీరు మార్చుకోనివారిపై కేసులు నమోదు


హోటల్‌లో మరిగిన నూనెను పరీక్షిస్తున్న శ్రీనివాస్ తదితరులు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): హోటల్స్ యజమానులకు గతంలోనే పలు ఆదేశాలు జారీ చేసినప్పటికీ వాటిని పట్టించుకోకుండా వ్యవహరిస్తున్న తీరు దారుణమని జిల్లా సహాయ ఆహార నియంత్రణ అధికారి బి.శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హైజనిక్ లోపాలతో పాటు నిషేధిత ప్లాస్టిక్ కవర్ల వినియోగం, అపరిశుభ్ర పరిసరాలపై కేసులు నమోదు చేయడంతో పాటు పలువురు హోటల్ యజమానులకు నోటీసులు జారీచేసి జరిమానాలు విధించారు. అమలాపురం పురపాలక సంఘ కార్యాలయం నుంచి గురువారం ఉదయం ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీకాంత్‌చౌదరి, రుక్కయ్య, సుబ్బారావులతో కూడిన ఫుడ్ సేఫ్టీ అధికారుల బృందం ఆకస్మికంగా ఉదయం నుంచి రాత్రి వరకు హోటళ్లపై తనిఖీలు నిర్వహించారు. ప్రధానంగా మూడు హోటళ్లపై కేసులు నమోదు చేసినట్టు శ్రీనివాస్ తెలిపారు. అమలాపురం మెయిన్‌రోడ్డులోని సుబ్బారావు హోటల్, మహిపాలవీధిలోని బొండంబాబాయ్ హోటల్, గాయత్రీ టిఫిన్స్ సెంటర్లపై కేసులు నమోదు చేశామన్నారు. ఆయా హోటళ్లలో ఆయిల్‌ను మార్చకుండా అదే ఆయిల్‌తో అనేక రకాల వంటకాలు చేస్తుండడాన్ని గుర్తించారు. సుబ్బారావు హోటల్‌లో హైజనిక్ లోపాలు తీవ్రంగా ఉండడంతో గతంలోనే హెచ్చరించామన్నారు. పూర్తిస్థాయిలో ఇన్వేషన్ చేసిన తర్వాత మాత్రమే తిరిగి హోటల్ తెరిచేలా కమిషనర్ కేవీఆర్ఆర్ రాజును ఆదేశించారు. శ్రీదేవిబార్ అండ్ రెస్టారెంట్, విష్ణుశ్రీ హోటళ్లతో పాటు గాయత్రీ టిఫిన్స్, గణపతి స్వీట్స్, గణపతి టిఫిన్స్, విజయదుర్గా హోటల్, గ్రీన్‌ట్రీ హోటల్స్‌కు ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు జారీచేయడంతో పాటు జరిమానాలు విధించామన్నారు. విష్ణుశ్రీ హోటల్‌లో శ్రీనివాస్ ఆధ్వర్యంలో తనిఖీలు జరుపుతుండగా హోటల్‌యాజమాన్యం ఎమ్మెల్యే ఫోన్ చేస్తున్నారని ఒక్కసారి మాట్లాడాలని కోరడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పటికే తనిఖీలు చేస్తున్న సిబ్బందిపై హోటల్ సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేసిన తీరుపై ఆయన మండిపడ్డారు. హైజనిక్ లోపాలున్న ఫొటోలను అధికారులకు, ప్రజాప్రతినిధులకు పంపించాలని ఆయన సూచించారు. హోటల్స్‌లో ఎక్కడైనా హైజనిక్ లోపాలున్నా, సరుకునాణ్యతలో లోపాలున్నా కోనసీమ జిల్లాకు నియమితులైన ఫుడ్‌ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ చౌదరి సెల్ 8977163695కు సమాచారం అందించాలని కోరారు.

సమస్యలతో గురుకుల విద్యార్థుల ఇబ్బందులు

రాణేలంక గురుకుల పాఠశాలకు భూమి ఉన్నా క్రీడా స్థలం కరువు


రాణేలంక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల


అడవిని తలపిస్తున్న పాఠశాల ఆవరణ

ముమ్మిడివరం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ముమ్మిడివరం మండలం రాణేలంకలో 10.25 ఎకరాల విస్తీర్ణంలో 2011-12లో కోట్లాది రూపాయలతో గురుకుల పాఠశాల నిర్మాణం జరిగింది. విద్యార్థినులకు అవసరమైన తరగతి గదులు, భోజనశాల, వసతిగృహం, ప్రిన్సిపాల్ క్వార్టర్ వంటి వాటిని నిర్మింప చేశారు. విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించారు. అయితే ఇంకా కొన్ని సమస్యలు వెంటాడుతున్నాయి. ఈగురుకుల పాఠశాలలో 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 560 మంది విద్యార్థినులు విద్యను అభ్యసిస్తున్నారు. సుమారు ఏడు ఎకరాల భూమి ఉంది. మరో మూడు ఎకరాల భూమి నిరుపయోగంగా ఉంది. పాఠశాల ఆవరణ లోతట్టు ప్రాంతం కావడంతో వర్షం వస్తే నీరు నిలిచిపోయి దోమలు, పాముల బెడద ఎక్కువగా ఉంది. చెత్తాచెదారం పెరిగిపోయి దట్టమైన చెట్ల పొదలతో అడవిని తలపిస్తోంది. పాఠశాల ఆవరణ క్లీనింగ్ బాధ్యత, అవుట్ సోర్సింగ్ ఏజెన్సీకి అప్పగించడంతో ఇటీవల కాలంలో ఒక్కసారి కూడా పాఠశాల ఆవరణను శుభ్రం చేసిన దాఖలాలు లేవు. చెత్తా చెదారం, పిచ్చి మొక్కలతో నిండి ఉంది. ఇక క్రీడా స్థలం విషయానికి వస్తే మూడు ఎకరాల నిరుపయోగంగా ఉంది. ఆ భూమి పల్లంగా ఉండడంతో పాటు గురుకుల పాఠశాల నిర్మాణానికి ముందే అక్కడొక ప్రైవేటు వ్యక్తికి పట్టా మంజూరు చేయడంతో ఇళ్లను నిర్మించుకోవడం జరిగింది. అయితే ఆ వ్యక్తి గురుకుల పాఠశాల మార్గం నుంచి రాకపోకలు సాగించడంతో విద్యార్థినుల తల్లిదండ్రులు అభ్యంతరం పెట్టడంతో ఆ వ్యక్తి కోర్టును ఆశ్రయించాడు. గురుకుల పాఠశాల నుంచి ఆ స్థలంలోకి వెళ్లడానికి వీలు లేకుండా గోడ నిర్మించారు. దీంతో ఆ స్థలమంతా నిరుపయోగంగా ఉంది. గురుకుల పాఠశాల ప్రహరీ గోడ ఎత్తు తక్కువగా ఉండడంతో విద్యార్థినులకు అసౌకర్యంగా ఉంది. ప్రహరీ గోడను ఎత్తుచేసి లైట్లు ఏర్పాటు చేయాలని, ప్రధాన ద్వారం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు. గురుకుల పాఠశాలలో మూడు ఆర్వో ప్లాంట్లు ఉండగా ఆర్‌డబ్ల్యుఎస్‌కు చెందిన ఒక ప్లాంటు ఉంది. గెయిల్ సంస్థ వారు ఒకటి, ఓఎన్జీసీ వారు ఒకటి, 2021-22లో నాడు-నేడులో రూ.5లక్షలతో ఒక ఆర్వో ప్లాంటు ఏర్పాటుచేశారు. వీటిలో ఓఎన్జీసీ వారు సమకూర్చిన ఆర్వో ప్లాంటు ఒకటే పనిచేస్తోంది. ఆర్‌డబ్ల్యుఎస్ వాటర్ ప్లాంటు కూడా పనిచేస్తోంది. నాడు-నేడులో ఏర్పాటుచేసిన ఆర్వో ప్లాంటు తరచూ రిపేర్లు రావడంతో మూలన పడింది. గురుకుల పాఠశాలలో విద్యార్థినులు నిద్రించేందుకు బెడ్‌లు లేకపోవడంతో కటిక నేలపైనే నిద్రిస్తున్నారు. స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ నల్లా వీరవెంకటసత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఇటీవల అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్‌లకు ఫిర్యాదు చేయడంతో గురుకుల పాఠశాల స్థితిగతులపై అధ్యయనం చేసేందుకు డిప్యూటీ కలెక్టర్, ఐసీడీఎస్ పీడీ ఝాన్సీరాణి, ఏపీఈడబ్ల్యుఎస్ డిపార్టుమెంట్ డీఈ సుబ్బరాజు, సీడీపీవోవై వై.విజయశ్రీలతో కూడిన బృందాన్ని ఆదేశించగా వారు పాఠశాలను సందర్శించి అక్కడున్న సమస్యలపై కలెక్టర్‌కు నివేదించారు. విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులను తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కూటమి అభ్యర్థి రాజశేఖర్ విజయానికి కృషి చేయండి


ఉప్పలగుప్తం: చల్లపల్లిలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల నియోజకవర్గ కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో ఉన్న పేరాబత్తుల రాజశేఖర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు కూటమి నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం కార్యకర్తలతో సమావేశం అనంతరం చల్లపల్లిలో గ్రాడ్యుయేట్ ఓటర్లను కలిసి కూటమి అభ్యర్థికి ఓటెయ్యాలని అభ్యర్థించారు. ఎన్నికల పరిశీలకులు కర్రోతు బంగార్రాజు,పెచ్చెట్టి బాబు, టీడీపీ గ్రామకమిటీ అధ్యక్ష, కార్యదర్శులు నిమ్మకాయల చెల్లయ్యనాయుడు, బూసి బుజ్జిదొర, నియోజకవర్గ టీడీపీ యువత అధ్యక్షుడు గొలకోటి చిన్నా, సర్పంచ్ ఇసుకపట్ల జయమణిరఘుబాబు, ఆకుల సూర్యనారాయణమూర్తి, పోలిశెట్టి శివాజీ, దంగేటి రవీంద్రనాథ్, సుంకర రాంబాబు, సుంకర చిన్నబ్బాయి, కుంపట్ల వెంకన్నబాబు, నిమ్మకాయల పేరయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల ప్రచారం
కాట్రేనికోన, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): వేట్లపాలెం, అడవిపేట, జిల్లెల్లవారిపేట తదితర ప్రాంతాల్లో గురువారం కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ గెలుపు కోసం టీడీపీ నాయకులు ప్రచారం చేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు, వెంట్రు సుధీర్, విత్తనాల వెంకటరమణ, వాసంశెట్టి రాజేవ్వరరావు, విత్తనాల బుజ్జి, మోకా అప్పాజీ, నేలపాటి చెంచలరావు, మాదే యోగీశ్వరి, కడలి వెంకటసత్యనారాయణ, జంగా శ్రీనివాస్, కొవ్వూరి శ్రీనివాసరాజు, ఊరం కృష్ణ, సానబోయిన వెంకటేశ్వరరావు, కర్రి సత్తిబాబు పాల్గొన్నారు.

మొదటి ప్రాధాన్యతా ఓటు వేయాలి
అంబాజీపేట, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేయాలని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి నాగాబత్తుల వెంకటసుబ్బారావు కోరారు. మాచవరంలో కూటమి నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు నాగాబత్తుల శాంతకుమారి, కొప్పినీడి ఈశ్వరరావు, యాగన రాము, మింగే కృష్ణ, పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు, రాయపురెడ్డి గోపి, మట్టా నాగేంద్ర, దాసరి చిన్న, అడబాల సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

దిండిలో ఎన్నికల ప్రచారం
మలికిపురం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): దిండిలో పేరాబత్తుల రాజశేఖర్‌కు మద్దతుగా దిండి సర్పంచ్ ముదునూరి శ్రీనివాసరాజు, తెలుగుదేశం పార్టీ అమలాపురం పార్లమెంటరీ అధికార ప్రతినిధి బందెల పద్మలు పట్టభద్రులను, ఉద్యోగులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. వారి వెంట దోనిపాటి రాజు తదితరులు ఉన్నారు.

రాజశేఖర్‌ను గెలిపించాలి
అల్లవరం ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని యెంట్రుకోన, దేవగుప్తం గ్రామాల్లో టీడీపీ కూటమి నాయకులు ప్రచారం చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పార్టీలు బలపరుస్తున్న రాజశేఖర్ ఘన విజయం సాధిస్తారని పేర్కొన్నారు. మాజీ సర్పంచ్ తోలేటి దొరయ్యనాయుడు(నానాజీ), తోలేటి సాగర్‌కుమార్, టీడీపీ బీసీసెల్ ప్రముఖులు గెద్దాడ శ్రీనివాసరావు, నార్గన శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ పోతుల నాగరాజు, ఎంపీటీసీ ముత్తాబత్తుల రాంబాబు తదితరులు ప్రచారం చేశారు.

రూ.44 వేలు జరిమానా
అమలాపురం టౌన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన నలుగురు వాహనచోదకులకు ఒక్కొక్కరికీ రూ.11వేలు చొప్పున అమలాపురం కోర్టు రూ.44వేలు జరిమానా విధించినట్టు గురువారం పట్టణ ఎస్ఐ కిశోర్‌బాబు తెలిపారు.

మహాశివరాత్రి ఏర్పాట్లను పరిశీలించిన డీసీ
ఐ.పోలవరం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఏర్పాట్లను దేవదాయశాఖ డీసీ డీఎల్‌వీ రమేష్‌బాబు గురువారం పరిశీలించారు. ఏర్పాట్లకు సంబంధించిన అంశాలను ఆలయ ఏసీ మాచిరాజు లక్ష్మీనారాయణను అడిగి తెలుసుకున్నారు. ఆఖరి రోజు స్వామివారి తెప్పోత్సవం నిర్వహణపై ఆయన పలు సూచనలు చేశారు. తొలుత ఆయన స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకుడు కటారి శ్రీనివాసరాజు, అర్చకులు యనమండ్ర సుబ్బారావు, యనమండ్ర సత్యసీతారామశర్మ, నాగాభట్ల శ్రీరామశర్మ తదితరులు పాల్గొన్నారు.

లీగల్ కమిటీ దివ్యాంగుల సమస్యల గుర్తింపు
అంతర్వేది, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మోరి గ్రామంలో రాజోలు మండల న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో లీగల్ కమిటీ సభ్యులు ఇంటింటా సర్వే నిర్వహించారు. శారీరక, మానసిక దివ్యాంగులను గుర్తించి వారి సమస్యలను తెలుసుకుని అవసరమైన సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో ప్యానల్ లాయర్లు సీహెచ్ సాగర్, డి.శ్రీనివాస్, పారా లీగల్ వలంటీర్లు కె.మహేష్, డి.సుబ్బలక్ష్మి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు టి.రంగారావు, రాధ, ఏఎన్ఎంలు కవితా, కీర్తి, ఆశ వర్కర్లు భాగ్యలక్ష్మి, దేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం
అమలాపురం టౌన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని 11కేవీ పేరూరు ఫీడర్, 11కేవీ కొంకాపల్లి ఫీడర్‌లో లైన్ వర్క్స్ మరమ్మతుల్లో భాగంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డివిజన్ ఈఈ కె.రాంబాబు తెలిపారు. శుక్రవారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు అమలాపురం గోఖలే సెంటర్, కళాశాల రోడ్డు, తారకరామా నగర్, ఎస్కేబీఆర్ కళాశాల రోడ్డు, ఎత్తురోడ్డు వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

మండల పరిషత్ వద్ద క్షుద్ర పూజల కలకలం

● పోలీసుల దర్యాప్తు ● భయాందోళనలో అధికారులు, సిబ్బంది


అల్లవరం మండలపరిషత్ కార్యాలయం వద్ద క్షుద్రపూజల ఆనవాళ్లు

అల్లవరం ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అల్లవరం మండల ప్రజాపరిషత్ కార్యాలయ ప్రాంగణంలో క్షుద్రపూజలు చేసిన సామగ్రి గురువారం కలకలం రేపింది. వరుసగా నాలుగు రోజుల పాటు అన్నం, కుంకుమ, ఎండుమిర్చి, పూలతో కూడిన సంచులు దర్శనమివ్వడంతో సిబ్బంది కలవరపడ్డారు. ఎవరి మీదనో క్షుద్రపూజలు చేస్తున్నారంటూ భయాందోళనకు గురయ్యారు. ఏడాదిన్నర క్రితం ఈవోపీఆర్డీగా పనిచేసిన వెంకటేశ్వరరావు తన కార్యాలయ గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనకు సంబంధించి భయాందోళన పోకుండానే ప్రస్తుతం క్షుద్రపూజలు కలకలం రేపాయి. దీనిపై సమాచారం అందుకున్న ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ పోలీసులకు సమాచారం అందించారు. ప్రభుత్వ కార్యాలయం లోపల క్షుద్ర పూజల సామగ్రి గోడపై ఓ వృద్ధ మహిళ పడవేసినట్టు సీసీ ఫుటేజ్ దృశ్యాలు నిర్ధారిస్తున్నాయి. ఎస్ఐ జి.హరీష్‌కుమార్ ఆదేశాల మేరకు ఎంపీడీవో చాంబర్ పక్కన పడి ఉన్న క్షుద్ర పూజల సామగ్రిని ఏఎస్ఐ శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. సీసీ ఫుటేజ్‌లను కూడా పరిశీలించి మండల పరిషత్ పక్కన ఉండే ఓ వృద్ధ మహిళ వీటిని పడేస్తున్నట్టు నిర్ధారించుకున్నారు. ఈసంఘటనకు సంబంధించి స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

బీజేపీ రాజోలు మండల అధ్యక్షురాలిగా నాగలక్ష్మి
రాజోలు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాజోలు మండలం అధ్యక్షురాలుగా కూనవరం గ్రామానికి చెందిన చెల్లింగి వెంకటనాగలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శివకోటిలో చింతా సత్యవరప్రసాద్ అధ్యక్షతన గురువారం బీజేపీ నాయకుల సమావేశం జరిగింది. సమావేశానికి మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా హాజరయ్యారు. ఈసందర్భంగా నూతన కార్యవర్గాన్ని నియమించారు. మండల ప్రధాన కార్యదర్శులుగా వడ్లమూడి ఆదిలక్ష్మి, బొలుసు గిరిబాబు, ఉపాధ్యక్షులుగా నార్కెడుమిల్లి బాలకృష్ణ, గంటి చంద్రశేఖర్, పాటబళ్ల వెంకటఅప్పాజీ, గెద్దాడ ఆదిశేషగిరిరావు, యింటిపల్లి రామకృష్ణ, తలారి శ్రీనివాస్, కోశాధికారులుగా నూలు దాశరథి, కార్యదర్శులుగా చింతా సత్యవరప్రసాద్, వానరాశి చక్రధరరావు, గుబ్బల రాంబాబు, కొమ్ముల శ్రీనివాస్, అంకాడి శ్రీనివాస్, కె.సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనకార్యవర్గాన్ని మాజీ ఎమ్మెల్యే వేమా అభినందించారు

అంగన్‌వాడీలకు జీవనజ్యోతి శిక్షణ
అంతర్వేది, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలం గీతామందిరం ఉన్నత పాఠశాలలో మూడో రోజు శిక్షణను జిల్లా సెక్టోరియల్ అధికారి బొరుసు సుబ్రహ్మణ్యం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జ్ఞానజ్యోతి శిక్షణలో అంశాలను అవగాహన చేసుకుని క్షేత్రస్థాయిలో అమలు చేసి చిన్నారులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి విద్యార్థుల శాతం పెరిగేందుకు కృషి చేయాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు చిన్నారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి జ్ఞానమనే జ్యోతిని వెలిగించడం ద్వారా భావితరాల్లో పిల్లలను అత్యుత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని మండల విద్యాశాఖాధికారి డి.కిశోర్‌కుమార్ అన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కె.వీరాస్వామి, రిసోర్స్ పర్సన్ మీరా ముస్నీసా, విజయభారతి, చంద్రకళ, శ్రీనివాస్, సత్తిపండు, మధువర్మ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి

కాట్రేనికోన, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): దొంతికుర్రు మాజీ సర్పంచ్ కొప్పిశెట్టి దుర్గాలక్ష్మి(65)గురువారం గుండెపోటుతో మృతి చెందారు. ఆమె 2006 నుంచి 2012 వరకు సర్పంచ్‌గా పనిచేశారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆమె మృతికి ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు నడింపల్లి సుబ్బరాజు, ఆకాశం శ్రీను, ఇసుకపట్ల వెంకటేశ్వరరావు సంతాపం వ్యక్తం చేశారు.

సామాజిక మాధ్యమాల్లో శెట్టిబలిజల మనోభావాలను దెబ్బతీసిన వారిపై చర్యలు తీసుకోవాలి
అమలాపురం టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా వేదికగా శెట్టిబలిజ కులాన్ని, మహిళలను కించపరుస్తూ పోస్టింగులు పెడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సంఘీయులు గురువారం అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. సోషల్ మీడియా వేదికగా జాతి పితామహుడైన దొమ్మేటి వెంకటరెడ్డిని కించపరచడంతో పాటు మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని వారు తీవ్రంగా ఖండిస్తూ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. కువైట్, బెహ్రయిన్‌లో ఉంటున్న కొందరు వ్యక్తులు సోషల్ మీడియాలో జాతిని అవహేళన చేస్తూ పోస్టింగులు పెడుతున్నారని డీఎస్పీకి వివరించారు. ఫిర్యాదు చేసిన వారిలో కుడుపూడి వెంకటేశ్వర (బాబు), సంసాని బులినాని, చెల్లుబోయిన శ్రీనివాసరావు, గొవ్వాల రాజేష్, మట్టపర్తి నాగేంద్ర, కుడుపూడి భరత్‌భూషణ్, చెల్లుబోయిన నాని, చిట్టూరి పెదబాబు, విత్తనాల మూర్తి, కేతా భానుతేజ, దంగేటి రుద్ర తదితరులు పాల్గొన్నారు.

రంకిరెడ్డి కాశీ మృతికి సంతాపం
అంబాజీపేట, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఎంతో మంది క్రీడాకారులను జాతీయ స్థాయికి ఎదిగేలా తర్ఫీదునందించి, ఎందరో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన విశ్రాంత హెచ్ఎం, పీడీ రంకిరెడ్డి కాశీవిశ్వనాథం మృతి క్రీడాలోకానికి తీరనిలోటని అంబాజీపేట వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధి కొర్లపాటి వీరవెంకట సత్యనారాయణ(బాబులు) అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం పాఠశాల పూర్వ విద్యార్థులు, క్రీడాకారులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల పీడీ కుంపట్ల ఆదిలక్ష్మి, వెటరన్ క్రీడాకారులు గోదాశి శ్రీను, కొర్లపాటి వెంకటేశ్వరరావు, బొంతు రమేష్, కోటిపల్లి శ్రీను, మేడిద సతీష్, కె.దావీదు సంతాపం వ్యక్తం చేసిన వారిలో ఉన్నారు.

వ్యాయామోపాధ్యాయుల సంతాపం
అల్లవరం ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): సీనియర్ వ్యాయామోపాధ్యాయుడు రంకిరెడ్డి కాశీవిశ్వనాథం మృతిపట్ల పలువురు సంతాపం తెలిపారు. కాశీవిశ్వనాథం మృతి తీరని లోటని వ్యాయామోపాధ్యాయులు ఉండ్రు సత్యవెంకటముసలయ్య, ఆకుల దుర్గాప్రసాద్, కొండేపూడి ఈశ్వరరావు సంతాపం వ్యక్తం చేసి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

పాలిటెక్నిక్ విద్యార్థికి అభినందన
పుదుచ్చేరి, తమిళనాడు రాష్ట్రాల్లో టాపర్
యానాం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): తమిళనాడు టెక్నికల్ ఎడ్యుకేషన్ ఇటీవల నిర్వహించిన పాలిటెక్నిక్ ఐదో సెమిస్టర్ పరీక్షల్లో యానాం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పాలిటెక్నిక్ కళాశాలలో కంప్యూటర్ సైన్సు కోర్సు చదువుతోన్న విద్యార్థిని నేరెళ్ల సుప్రియ 700లకు 698మార్కులు సాధించి తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లో టాపర్‌గా నిలిచింది. ఈసందర్భంగా పుదుచ్చేరి ప్రభుత్వ డిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు సుప్రియను సత్కరించారు. ప్రాక్టికల్ పరీక్షల్లో రెండు మార్కులు తగ్గాయని, లేకుంటే 700కు 700మార్కులతో కంప్యూటర్ సైన్స్‌లో రికార్డు సృష్టించేదని కుటుంబ సభ్యులు అన్నారు. అలాగే సుప్రియను ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, పరిపాలనాధికారి మునిస్వామి తదితరులు శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.వేలాయుధం, సీఎస్ఈ విభాగాధిపతి చంద్రశేఖర్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన
ముమ్మిడివరం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం సీహెచ్ గున్నేపల్లిలో సత్తెమ్మతల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు రెండో రోజుకు చేరుకున్నాయి. గురువారం ఉదయం అమ్మవారికి విశేష పూజలు జరిపించారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. రాత్రి కుమార్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో జబర్దస్త్ కామెడీ షో, సినీగాయనీ, గాయకులతో సంగీత విభావరిని నిర్వహించారు. ప్రేక్షకులను సంగీత విభావరి విశేషంగా ఆటకట్టుకుంది. ధనుంజయ, సుమంత్, సమీరభరద్వాజ్, సాయిశిల్ప, నూకరాజు, తన్మయి ఆలపించిన గీతాలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి.

ఆర్థిక సహాయం
మలికిపురం, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): చింతలమోరిలో అనారోగ్యంతో బాధపడుతున్న ర్యాలి సూర్యనారాయణకు నిరుపేదల సహాయనిధి గ్రూపు సభ్యులు గెడ్డం సురేష్, చవ్వాకుల మోహన్, కొల్లాబత్తుల రాజ్‌కుమార్, కొల్లాబత్తుల ఝాన్సీ, గంటా సుధాకర్ రూ.10వేలు సమకూర్చారు. ఈనగదును మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అందించారు. ఎంపీటీసీ తోట రాజేష్, కొల్లాబత్తుల అశోక్, బోనం వెంకటరామారావు పాల్గొన్నారు.

మోరి మహాలక్ష్మమ్మ ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ
మలికిపురం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఈనెల28నుంచి మార్చి 15వరకు జరిగే మోరి మహాలక్ష్మమ్మ, కనకమహాలక్ష్మమ్మ అమ్మవార్ల జాతర, తీర్థ మహోత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ గురువారం ఆవిష్కరించారు. మోరి మహాలక్ష్మమ్మ ఆలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో మార్చి 9న మహాజాతర, 11న రథోత్సవం, 12న నైవేద్యాలు, 13న తెప్పోత్సవం, 17న అన్నసమారాధన జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, మండల టీడీపీ అధ్యక్షుడు ముప్పర్తి నాని, చాగంటి స్వామి, గుబ్బల ఫణికుమార్, గెడ్డం మహాలక్ష్మిప్రసాద్, కడలి వెంకటరత్నం, నిర్వాహకులు పాల్గొన్నారు.

సాయం అందజేత
ముమ్మిడివరం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): లంకాఫ్ ఠాణేలంకకు చెందిన గుబ్బల రామసత్యనారాయణ, ఉదయలక్ష్మి దంపతులు కొంత కాలంగా డీబీ వ్యాధితో బాధపడుతున్నారు. ఎ.వేమవరానికి చెందిన ముషిణి రాంబాబు బియ్యం, కూరగాయలు, దుప్పట్లు, చీర, నిత్యావసర సరుకులు సమకూర్చారు. సాయిసంజీవిని మహిళా నడక యోగా ఆరోగ్య సేవాసంస్థ అధ్యక్షురాలు, జోనల్ చైర్‌పర్సన్ జల్లి సుజాత గురువారం వాటిని ఆ కుటుంబానికి అందించారు. ప్రతీ నెల కుటుంబానికి సరిపడే నిత్యావసరాలు అందిస్తామని తెలిపారు. అలాగే వారి ఆరోగ్యం తెలుసుకుని సకాలంలో మందులు అందజేస్తున్న గుర్రాల అమల, కడలి సత్యనారాయణలను సుజాత అభినందించారు. టీడీపీ నాయకులు గొల్లపల్లి గోపి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పేరాబత్తులను నెగ్గించాలి
రాజోలు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పొన్నమండ, కడలి, కాట్రేనిపాడు, మెరకపాలెం గ్రామాల్లో గురువారం పర్యటించారు. మొదటి ప్రాధాన్యతా ఓటును పేరాబత్తులకు వేసి అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే దేవ కోరారు. రాజోలు నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు చిటికెల రామ్మోహనరావు, గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, రాజోలు నియోజకవర్గం బూత్ కమిటీల కోఆర్డినేటర్ చాగంటి స్వామి, సూరిశెట్టి శ్రీనివాస్, కడలి శ్రీదుర్గ, దాకే ఏడుకొండలు, మోకా ఏడుకొండలు, కడలి మోహన్, కడలి అబ్బు తదితరులు పాల్గొన్నారు.

శెట్టిబలిజ కులాన్ని దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలి
రాజోలు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో శెట్టిబలిజ కులాన్ని దూషిస్తూ మహిళల పట్ల అసభ్య పదజాలంతో వ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాజోలు తాలూకా శెట్టిబలిజ సంక్షేమ సంఘం నాయకులు రాజోలు సర్కిల్ పోలీసుస్టేషన్ కార్యాలయంలో సీఐ టీవీ నరేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. రాజోలు తాలూకా శెట్టిబలిజ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు గుబ్బల బాబ్జి, అధ్యక్షుడు దొమ్మేటి ఉమామహేశ్వరరావు, సెక్రటరీ గుబ్బల మనోహర్, సంఘ కన్వీనర్ గుబ్బల శ్రీనివాస్, చిట్టూరి గణేశ్వరరావు, కడలి సత్యనారాయణ, గుబ్బల కుమార్, కాండ్రేగుల కుసులుడు, మొల్లేటి సత్యనారాయణ పాల్గొన్నారు.

'రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెడితే చర్యలు'
రాజోలు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అనవసరమైన అసభ్యకరమైన ప్రజలను రెచ్చగొట్టే విధంగా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా పోస్టింగ్ పెట్టిన వారిపై కఠినచర్యలు తీసుకుంటామని కొత్తపేట డీఎస్పీ ఎస్.మురళీమోహన్ హెచ్చరించారు. శివకోటిలో మంగెన గంగయ్య తెలగ కల్యాణ మండపంలో విద్యార్థుల భవిష్యత్తు, కార్యాచరణపై గురువారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు దుష్ప్రచారాలు నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తి, రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్, ఎస్ఐలు బి.రాజేష్‌కుమార్, చైతన్యకళాశాల ప్రిన్సిపాల్ ఆదినారాయణ, ఏబీవీపీ అధ్యక్షుడు పి.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

యూనిఫామ్స్ పంపిణీ
మామిడికుదురు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మామిడికుదురు జడ్పీ ఉన్నత పాఠశాలలోని 36మంది విద్యార్థులకు స్కౌట్ గైడ్స్ యూనిఫామ్స్‌ను ఎంఈవోలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు గురువారం పంపిణీ చేశారు. పాఠశాల పీఎంశ్రీ పథకానికి ఎంపిక కావడంతో స్కూల్‌కు రూ.50వేలు మంజూరు చేశారు. వీటిలో రూ.30వేలతో కొనుగోలుచేసిన స్కౌట్ గైడ్స్ యూనిఫామ్స్‌ను ఎంఈవోలు అందించారు. హెచ్ఎం సీహెచ్ నిరంజని, ఉపాధ్యాయులు డి.సత్యనారాయణ, రమేష్‌బాబు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.30వేలు విరాళం
మామిడికుదురు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ స్వామి నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన జాన ప్రభాకరరావు-నాగలక్ష్మి దంపతులు రూ.30వేలు విరాళంగా అందించారు. దాతభక్తులకు అర్చకులు వేదాశీర్వచనంఇచ్చి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించి అభినందించారు. బొక్కా సత్యంమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం
మామిడికుదురు, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): శుక్రవారం ఉదయం 10 నుంచి 6గంటల వరకు సరఫరాలో అంతరాయం ఏర్పడు తుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రాంబాబు తెలిపారు. పాశర్లపూడి మెయిన్‌రోడ్డు 11కేవీ లైన్‌లో విద్యుత్ స్తంభాలు మార్చడం కోసం నగరం సబ్‌స్టేషన్ పరిధిలోని పాశర్లపూడి, పాశర్లపూడి బాడవ, బి.దొడ్డవరం, పెదపట్నంలంక, పాశర్లపూడిలంక, బాడిలంక గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

లాడ్జిలో వ్యక్తి మృతి
అమలాపురం టౌన్, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): విజయవాడకు చెందిన యలమంచిలి వెంకటజయనేంద్ర(28) వారం రోజులుగా అమలాపురంలోని ఒక లాడ్జిలో ఉంటున్నాడు. మద్యానికి బానిసై అపస్మారకస్థితిలో ఉన్న జయనేంద్రను గురువారం ఉదయం ఆసుపత్రికి తరలించగా మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. సీఐ పి.వీరబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందజేత
యానాం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): యానాం శారదా విద్యా నికేతన్ ఎయిడెడ్ పాఠశాలలో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను అందజేశారు. స్వర్గీయ చింత సుబ్రహ్మణ్యం శాస్త్రి పేరిట 2023-24లో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులకు వరుసగా పదివేలు, ఏడువేలు, ఐదువేలు, నాలుగువేల రూపాయలను పుదుచ్చేరి ప్రభుత్వ డిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి అందజేశారు. రాష్ట్ర స్థాయి సదరన్ విభాగంలో బహుమతులు సాధించిన చింత దుర్గాలక్ష్మి, షణ్ముఖప్రియ, సంగాడి అజయ్‌లను, ఉపాధ్యాయ బృందాన్ని ప్రత్యేకంగా సత్కరించారు. కార్యక్రమంలో శారదా విద్యానికేతన్ ఎడ్యుకేషనల్ చైర్మన్ కంచర్ల చిన్నాబ్బాయి, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు చింత వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన
యానాం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): యానాం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పాలిటెక్నిక్ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తొలుత స్థానిక జీఎంసీ బాలయోగి క్రీడామైదానంలో విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించారు. పరిపాలనాధికారి మునిస్వామి జెండా ఊపి క్రీడా పోటీలను ప్రారంభించారు. ప్రిన్సిపాల్ వేలాయుధం, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ ప్రారంభం
అంబాజీపేట, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. స్కౌట్స్, గైడ్స్ సలహాదారుడు జేవీఎస్‌కే గోపాలకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక పాఠశాల నుంచి 16మంది బాలికలు, 16మంది బాలురు శిక్షణకు ఎంపిక య్యారు. టీచర్లు ఎల్.వెంకటేశ్వరరావు, టి.రామాకుమారిల ఆధ్వర్యంలో స్కౌట్, గైడ్ నియమ నిబంధనలు, విధులు వివరించారు. ఎంఈవోలు కె.వెంకటేశ్వరరావు, ఎం.ప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జ్ఞానజ్యోతి మూడో రోజు శిక్షణ
అంబాజీపేట, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మండలంలోని అంగన్‌వాడీ టీచర్లకు జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వీఎస్వీ మహాలక్ష్మి, ఎన్.వెర్నమ్మలు శిశుసంక్షేమ శాఖ పూర్వ ప్రాథమిక విద్యపై అవగాహన కల్పించారు. డీఆర్పీలు సీహెచ్ వెంకటసతీష్, శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం
పి.గన్నవరం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ సీఎంగా ఆర్యవైశ్య మహిళను ఎంపిక చేసినందుకు పి.గన్నవరం బీజేపీ పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు తిక్కా సత్తిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్ర మంలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి స్వీట్లు పంచారు. ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆరుమిల్లి వీరభద్రరావు, చీకరమిల్లి శ్రీనివాసరావు, అడ్డాల వెంకటేశ్వరరావు, జి.సూర్యనారాయణ, పాబోలు కృష్ణ, శ్రీకాకుళపు లక్ష్మీనారాయణ, వంకాయల బాలయ్య, తోలేటి సుబ్బారావు, ముదునూరి వెంకటరామరాజు, ఇలపర్తి మల్లేశ్వరరావు పాల్గొన్నారు.



వేంకటేశ్వరస్వామి ఆలయంలో తిరుప్పావడ సేవను తిలకిస్తున్న భక్తులు

చింతలూరులో వైభవంగా తిరుప్పావడ సేవ

ఆలమూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలూరులో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక పాంచాహ్నిక బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజైన గురువారం తిరుప్పావడ సేవ (అన్నకూటోత్సవం) నిర్వహించారు. సుమారు 200 కిలోల పులిహోరను స్వామివారి ఎదురుగా రాశిగా పోసి నివేదన చేశారు. అనంతరం ప్రసాదాన్ని భక్తులకు పంచిపెట్టారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



హనుమద్ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

స్వామి, అమ్మవార్లకు ఉదయం సుప్రభాత సేవ, తోమాల సేవ, తిరుప్పావడ సేవలను వేద పండితుడు వాడపల్లి గోపాలాచార్యులు అధ్వర్యంలో జరిపించారు. మాఘ మాస వ్రతం చేశారు. సాయంత్రం స్వామివారిని హనుమద్ వాహనంపై ఆశీనులు గావించి మేళతాళాలు, కోలాట ప్రదర్శన, మహిళల భక్తి గీతాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు.



కోటిపల్లిలో కార్యదర్శులకు సూచనలు ఇస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

మహా శివరాత్రి ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన

కె.గంగవరం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కోటిపల్లి పుణ్యక్షేత్రంలో ఈ నెల 25 నుంచి 27 వరకు మహా శివరాత్రి ఉత్సవాల నిర్వహణకు చేస్తున్న ఏర్పాట్లు ఎంపీడీవో ఎన్.శ్రీనివాసరావు, తహశీల్దారు బండి మృత్యుంజయరావు గురువారం పరిశీలించారు. పుష్కరాల రేవులో భక్తుల పుణ్యస్నానాలకు జల్లు ఏర్పాట్లను సమయానికి పూర్తి చేయాలన్నారు. ఉత్సవాల మూడు రోజులూ గ్రామంలో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, పరిసర గ్రామాల నుంచి వచ్చిన సిబ్బందికి షిఫ్టుల వారీగా విధులు కేటాయించాలని కార్యదర్శి సుబ్బారావును ఆదేశించారు. అనంతరం కోటిపల్లిలో యండగండి, పామర్రు, సత్యవాడ, అముజూరు, సుందరపల్లి, కూళ్ల సచివాలయాల సిబ్బందితో సమీక్షించారు. గ్రామాల్లో ప్రస్తుతం జరుగుతున్న పలు రకాల సర్వేలు ఎంతవరకూ వచ్చాయో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వాటిని నిర్ణీత సమయాల్లో పూర్తి చేయాలని ఆదేశించారు.



అంగన్వాడీల శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఏఎంవో రాంబాబు

'పిల్లలకు భాష, సంఖ్యా జ్ఞానం అందించాలి'

కె.గంగవరం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు భాష, సంఖ్యా జ్ఞానం సరైన రీతిలో అందించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సమగ్ర శిక్షా ఏఎంవో పి.రాంబాబు పేర్కొన్నారు. కె.గంగవరం ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ టీచర్లకు జరుగుతున్న జ్ఞానజ్యోతి శిక్షణను ఆయన గురువారం పరిశీలించారు. ఐఈ వింగ్ కో-ఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ, ఎంఈవో-1 ఎ.నాగరాజు, ఎంఈవో-2 చోడిశెట్టి అంజనేయులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు చంద్రకళ, పార్వతి, సీఆర్పీలు వెంకట్రావు, వెంకన్నబాబు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ వార్షికోత్సవ పూజలు

ద్రాక్షారామ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం వెంకటాయపాలెం శివారు దాసరిపాడులో ప్రసన్నాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ 24వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ యల్లమిల్లి సతీష్‌కుమార్-రవికుమార్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. రథోత్సవం నిర్వహించి అన్నసమారాధన జరిపారు. వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్, అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.





శిక్షణలో పాల్గొన్న వీవోఏలు, సీసీలు

యాప్‌ల నమోదుపై ముగిసిన శిక్షణ

ద్రాక్షారామ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్ ద్వారా స్వయం సహాయక సంఘాల సభ్యులు, గ్రామ సంఘాల వివరాలు లోకోస్ అప్లికేషన్ ద్వారా నమోదు, ఆర్థిక లావాదేవీల నమోదుపై సీసీలు, వీవోఏలకు రెండు రోజులు ఇచ్చిన శిక్షణ తరగతులు గురువారం ముగిసాయి. డీఆర్డీఏ రామచంద్రపురం ఏరియా క్లస్టర్ పరిధిలోని రామచంద్రపురం, మండపేట, రాయవరం, కపిలేశ్వరపురరం, కె.గంగవరం మండలాలకు చెందిన వీవోఏలు, సీసీలకు బుధ, గురువారం రామచంద్రపురం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏపీఎం వరహాలబాబు, జి.దుర్గాప్రసాద్, కాశింబి శిక్షణ ఇచ్చారు. ఏపీఎం అర్జున్, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి

జిల్లా పంచాయతీ అధికారి శాంతలక్ష్మి



ఈవోపీఆర్డీలనుద్దేశించి మాట్లాడుతున్న శాంతలక్ష్మి

రాయవరం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని కోనసీమ జిల్లా పంచాయతీ అధికారి దగ్గుమళ్ల శాంతలక్ష్మి సూచించారు. 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్'లో భాగంగా మండలంలోని సోమేశ్వరంలో ఘన వ్యర్థాల నిర్వహణపై ఈవోపీఆర్డీలకు గురువారం జిల్లా స్థాయిలో ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శి పల్లెటి వెంకటరత్నం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డీపీవో మాట్లాడుతూ త్వరలో ప్రతి ఇంటికీ రెండు డస్ట్‌బిన్‌లు పంపిణీ చేస్తామని... తడి చెత్త, పొడి చెత్త వేరుచేసి అందించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందన్నారు. గ్రామంలో పర్యటించిన డీపీవో ప్రజలకు తడి, పొడి చెత్తలపై అవగాహన కల్పించారు. జిల్లాలోని 22 మండలాల నుంచి వచ్చిన ఈవోపీఆర్డీలకు ఘన వ్యర్థాల నిర్వహణపై డీపీఆర్‌సీ టీమ్ సభ్యులు వి.భీమేశ్వరి, లావణ్య శిక్షణ ఇచ్చారు. డీఎల్పీవో పి.బొజ్జిరాజు, ఈవోపీఆర్డీ ఎం.శ్రీనివాసరావు, సచివాలయ కార్యదర్శి ఎం.వెంకటలక్ష్మి, వి.సావరం కార్యదర్శి జీవీ రమణ, పంచాయతీ, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాలు ఆర్థిక పరిపుష్టి సాధించాలి

డీఆర్డీఏ పీడీ శివశంకర్



చొప్పెల్లలో మహిళా శక్తి సంఘాలకు రుణాల చెక్కు అందజేస్తున్న శివశంకర్

ఆలమూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'లక్‌పతి దీదీ' రుణమేళా ద్వారా సాయం పొందిన స్వయం సహాయక సంఘాలు ఆర్థిక పరిపుష్టి సాధించాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా డీఆర్డీఏ పీడీ వి.శివశంకర్ సూచించారు. మండలంలోని చొప్పెల్ల, నర్సిపూడి చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు బ్రాంచిల ద్వారా స్వయం సహాక సంఘాలకు రూ.80లక్షల రుణాలను గురువారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ రుణాలపై వడ్డీ రాయితీ కల్పిస్తామని చెప్పారు. చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు రీజనల్ హెచ్‌వో డీఎస్ రత్నకుమార్, లోవరాజు, ఎన్.శ్రీనివాస్, డివిజన్ మేనేజరు గంటా శ్రీనివాసరావు, డీపీఎం డి.అన్నపూర్ణ, చొప్పెల్ల, నర్సిపూడి బ్రాంచిల మేనేజర్లు కె.ఉదయకుమార్‌దొర, ఎన్.శ్రీనివాస్, ఏపీఎం ఎం.ధనరాజు, సిబ్బంది ఆర్.సంతోష్‌కుమార్, ఎం.భాస్కర్ పాల్గొన్నారు.





రావులపాలెంలో ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే బండారు, కూటమి నాయకులు, కపిలేశ్వరపురం మండలం అంగరలో ప్రచారం

యువత భవిష్యత్తుకు కూటమి ప్రభుత్వం కృషి

రావులపాలెం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): యువత భవిష్యత్తుకు కూటమి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెంలోని టీడీపీ క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన ఆధ్వర్యంలో కూటమి నేతల సమావేశం నిర్వహించారు. జనసేన కొత్తపేట నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్, వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీ గణేష్‌కుమార్, పరిశీలకులు వాసిరెడ్డి రాంబాబు, ఆకుల రామకృష్ణ, కేవీ సత్యనారాయణరెడ్డి, అయినవిల్లి సత్తిబాబుగౌడ్, పాలూరి సత్యానందం మాట్లాడారు. యువతకు కూటమి ప్రభుత్వం అన్ని రకాలుగా భరోసాగా నిలుస్తుందన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి పట్టభద్రులు మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో కూటమి నాయకులు ప్రచారం నిర్వహించారు.

ఆలమూరు (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి మద్దతుగా మండలంలోని పలు గ్రామాల్లో కూటమి నాయకులు గురువారం ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఓటర్లను కలిసి రాజశేఖరానికి మొదటి ప్రాధాన్య వేయాలని కోరుతూ కరపత్రాలు అందించారు.

కపిలేశ్వరపురం (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి మద్దతుగా టీడీపీ అమలాపురం పార్లమెంటరీ అధికార ప్రతినిధి పుత్సల శ్రీనివాస్ ఆధ్వర్యంలో అంగర, పడమరఖండ్రిక గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కూటమి నాయకులు షేక్ కరీం, దానేటి శరత్, మేడిద రాంబాబు, శాంతి రమేష్, కట్టా నాగేంద్ర, యానాల సుబ్బారావు, కొమ్మిశెట్టి రాంబాబు, తోరాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ, ఆర్డీవో

పోలింగ్ కేంద్రాల పరిశీలన

రాయవరం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాయవరంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను రామచంద్రపురం ఆర్డీవో డి.అఖిల, రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్ గురువారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, మౌలిక సదుపాయాలను చూసి ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. తొలుత వారు తహసీల్దారు, మండల పరిషత్ కార్యాలయాలను వారు పరిశీలించారు. తహసీల్దారు ఐపీ శెట్టి, మండపేట రూరల్ సీఐ దొరరాజు, రాయవరం ఎస్ఐ సురేష్‌బాబు, ఎంపీడీవో ఎస్.కీర్తి స్పందన, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

'విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలి'

రాయవరం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని లొల్ల, నదురుబాద, సోమేశ్వరం గ్రామాల్లో విశిష్ట సంఖ్య నమోదు ప్రక్రియను మండల వ్యవసాయ అధికారి కె.ప్రభాకర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఇప్పటివరకు 3,190 మంది రైతులు రైతు విశిష్ట సంఖ్య నమోదు చేసుకున్నారని, మిలిగిన రైతులు ఈ నెల 24వ తేదీలోపు నమోదు చేసుకోవాలన్నారు. పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో రైతు సేవా కేంద్రాల వద్దకు వెళ్లి విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోవాలని సూచించారు.

'దోమల బారి నుంచి కాపాడండి'



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పగలు, రాత్రి తేడా లేకుండా ఎన్నడూ లేని విధంగా దోమలు పెరిగిపోయి ప్రజల రక్తాన్ని పీల్చి రోగాలపాల్జేస్తున్నాయని మున్సిపల్ ఎక్స్‌అఫీషియో సభ్యుడు రెడ్డి రాధాకృష్ణ ఆరోపించారు. మున్సిపాల్టీ తక్షణ చర్యలు తీసుకుని ప్రజలను రోగాల బారి నుంచి, దోమల బారి నుంచి కాపాడాలని ఆయన కోరారు. గురువారం మండపేట మున్సిపల్ అత్యవసర సమావేశం చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి అధ్యక్షతన జరిగింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో సభ్యులకు మాట్లాడే అవకాశం లేకపోయింది. అంశాలను లేవనెత్తినా అధికారులు సమాధానం ఇవ్వలేరని కమిషనరు రంగారావు చెప్పారు. రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు హాజరయ్యారు. అజెండాలో పొందుపరిచిన 001 పద్దుల ద్వారా రూ.28.79 లక్షలు, 002 పద్దుల ద్వారా రూ.63.43 లక్షలకు ఆమోదం తెలిపారు. పట్టణంలోని వార్డుల్లో కమిషనరు తిరగడం హర్షణీయమని, అయితే ఆయన వార్డు కౌన్సిలర్లకు సమాచారం ఇవ్వకపోవడం బాధాకరమని రాజబాబు అన్నారు. అత్యవసర సమావేశం ముగిసిన తర్వాత సభ్యులంతా కౌన్సిల్ హాల్లో అంతర్గతంగా ఇష్టాగోష్టిగా సమావేశమయ్యారు. వార్డుల్లో నెలకొన్న సమస్యలు, అభివృద్ధి పనులపై చర్చించినట్టు సమాచారం. కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

రైతులతో కలిసి వ్యర్థాలు తొలగించి....



పంట కాల్వలో వ్యర్థాలను తొలగిస్తున్న గారపాటి

ఆలమూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తాను కూడా మీలో ఒకడినంటూ రైతులతో కలిసి పంట కాల్వలో వ్యర్థాలను తొలగింపునకు నడుంకట్టారు చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాసరావు. చొప్పెల్ల లాకు నుంచి వచ్చే వెదురుమూడి పంట కాల్వలో వ్యర్థాలు భారీగా పేరుకుపోయాయి. దీంతో గురువారం ఆయన రైతులతో కలిసి వాటిని తొలగించారు. గారపాటిని పలువురు రైతులు అభినందించారు.

'స్వచ్ఛ మండపేట' లక్ష్యంగా పనిచేయాలి

మండపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణాన్ని స్వచ్ఛ మండపేటగా తీర్చిదిద్దేందుకు అధికారులకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనరు టీవీ రంగారావు పిలుపునిచ్చారు. గురువారం ఆయన మెప్మా సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. చెత్త సేకరణకు వెళ్లే సిబ్బందికి తడి, పొడి చెత్తలను వేర్వేరుగా అందించేందుకు ప్రజలు సహకరించేలా మెప్మా సిబ్బంది సహకారం అందించాలని కోరారు. ఇళ్ల వద్దే చెత్త నుంచి కంపోస్టు తయారు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో డీఈఈ శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్తిరాజు, మెప్మా సీఎంఎం సుజాత తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి: ఐదుగురి అరెస్టు

రాయవరం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమేశ్వరంలో పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేసినట్టు రాయవరం ఎస్ఐ డి.సురేష్‌బాబు చెప్పారు. అనసూరి ప్రసాద్, మిరియాల సత్యనారాయణ, గుర్రపు వీరరాఘవులు, గండు సాంబమూర్తి, దంగేటి విష్ణులను అరెస్టు చేసి వారి నుంచి రూ.5,600 నగదు స్వాధీనం చేసున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాడపల్లి వెంకన్న ఒక్కరోజు ఆదాయం రూ.1.96 లక్షలు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని గురువారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. నోము ఆచరించి అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.1,96,112 లభించినట్టు ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ద్రాక్షారామ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామలో 11కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్ మరమ్మతుల కారణంగా శుక్రవారం యానాం సెంటర్, అన్నాయిపేట, ద్రాక్షారామల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డీఈఈ కె.రత్నాలరావు తెలిపారు. రామచంద్రపురం కొత్తూరు ఫీడర్, టిడ్కో ఫీడర్, కొత్తూరు రూరల్ ఫీడర్ మరమ్మతుల కారణంగా కొత్తూరు, ఏపీ టిడ్కోకాలనీ, మాలపాడు, గొలుసుమిల్లి, చోడవరం పరిధిలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని డీఈఈ చెప్పారు.

రాయవరం (ఆంధ్రజ్యోతి): రాయవరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ రామచంద్రపురం డీఈఈ కె.రత్నాలరావు తెలిపారు. 11కేవీ నదురుబాద ఫీడర్, 11కేవీ రాయవరం ఫీడర్ మరమ్మతుల కారణంగా రాయవరం, నదురుబాద, వెదురుపాక, వి.సావరం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.



వీసీకి పురస్కారం ఇస్తున్న జీవీ రావు

నన్నయ యూనివర్శిటీ వీసీని కలిసిన జీవీ రావు

ద్రాక్షారామ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): నన్నయ యూనివర్శిటీ వీసీగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఎస్.ప్రసన్నశ్రీని మోడరన్ విద్యా సంస్థల అధినేత లయన్ జీవీ రావు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెకి మోడరన్ ఫౌండేషన్ తరఫున విద్యా స్ఫూర్తి పురస్కారం అందజేసి అభినందనలు తెలిపారు.



తెలుగు భాష ఔన్నత్యమిదీ...

మండపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంగమేశ్వర మండల పరిషత్ పాఠశాలలో మాతృ భాషా దినోత్సవాన్ని గురువారం ముందస్తుగా జరుపుకున్నారు. ఉపాధ్యాయుడు చిట్టూరి వెంకట శ్రీధర్ విద్యార్థులతో సీసాల మూతలు, చిన్నపాటి రాయిపిక్కలు, పెన్సిల్ పొట్టుతో తెలుగు అక్షరాలను తయారు చేయించారు. వారికి తెలుగు భాష ఔన్నత్యాన్ని వివరించారు.

కుంభమేళాకు 23న బస్సు

రావులపాలెం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మహా కుంభమేళాకు ఈ నెల 23వ చివరి బస్సు నడుపుతున్నట్టు ఆర్టీసీ రావులపాలెం డిపో మేనేజరు పీజీజీవీ రమణ తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు బస్సు బయల్దేతుందన్నారు. భోజన ఖర్చులు సహా టిక్కెట్టు ధర (పెద్దలు ఒక్కరికి) రూ.10,500. భువనేశ్వర్, పూరీ, కోణార్క్, ప్రయాగ్‌రాజ్ కుంభమేళా, వారాణసీ, గయ, బుద్ధగయ, అరసవల్లి, శ్రీకూర్మం దర్శనాల అనంతరం రావులపాలెం చేరుకుంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9959225537, 7382911871 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

మండపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సూర్యచంద్ర ఫిషర్‌మెన్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటుచేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ప్రారంభించారు. అంబాజీపేటకు చెందిన లేజర్ రైట్ ఆసుపత్రి వైద్యులు షైని, మౌనిక పర్యవేక్షణలో 300 మందికి కంటి, ఎముకలు, పంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులను ఉచితంగా అందజేశారు. ఫిషర్‌మెన్ సొసైటీ నాయకులు కాటా గోపి, పాండ్రంకి చిన్న, సింగిడి చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా తయారీ కేంద్రాల తనిఖీ

రాయవరం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక గణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్, భవాని ఫైర్ వర్క్స్‌లను రామచంద్రపురం డీఎస్పీ బి.రఘువీర్ గురువారం తనిఖీ చేశారు. బాణసంచా తయారీ కేంద్రాల్లో ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటిస్తున్నారో లేదో విషయాన్ని పరిశీలించారు. లైసెన్స్‌లను తనిఖీ చేశారు. బాణసంచా తయారీదారులు నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవన్నారు. డీఎస్పీ వెంట మండపేట రూరల్ సీఐ దొరరాజు, రాయవరం ఎస్ఐ డి.సురేష్‌బాబు, సిబ్బంది ఉన్నారు.